నిష్పక్షపాత వార్తల నిజరూపం
# నేటిధాత్రి®
వసంతాల అక్షరోద్యమం
TELUGU DAILY

20 YEARS ANNIVERSARY నేటిధాత్రి
20 ఏళ్ల వసంతం
మన నేటిధాత్రి వార్త దినపత్రిక అక్షర ప్రయాణం మొదలు పెట్టి 19 ఏళ్లు పూర్తి చేసుకొని 20 వసంతంలో అడుగిడిన శుభ సందర్భాన పాఠకులకు,ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు మీ ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని కోరుకుంటూ...మీ కట్టా రాఘవేంద్రరావు-ఎడిటర్

బుధవారం 16-10-2024 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 20 సంచిక : 169 రూ॥ 6.00










డీపీవో సంతోష్





# ఆ ఇద్దరు ఎంత "సంతోష" పెట్టారు?



చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేంద్రరావు
9063524196, 9908658888



# ఈ నలుగురు ఏం పాపం చేశారు!?

- ఈ రెండింటినీ కూల్చకుండ ఎందుకు ఆపారు?
- ఆ రెండింటికి సమయమెందుకిచ్చారు!
- ఉన్నఫలంగా ఈ నలుగురిని ఎందుకు రోడ్డు మీద పడేశారు?
- ఆ ఇద్దరికెందుకు ఇంకా సమయమిస్తున్నారు.
- చిత్రపురి కూల్చి వేతల్లో కిరికిరిలెందుకు పెట్టారు.
- కూల్చివేతల్లో వ్యత్యాసం ఎందుకు చూపించారు.
- ఆ ఇద్దరి మీద వున్న మమకారం ఏమిటి?
- ఈ నలుగురి మీద లేని కనికరానికి కారణమేమిటి?
- ఆ మాజీ ఎమ్మెల్సీకి రో హౌజ్ ఎలా వచ్చింది.
- చిత్రపురిలో ఈ మతలబు ఏమిటి?
- చిత్రపురి సొసైటీలో బంధువుకు రోహౌజ్ కేటాయింపేమిటి?
- కూల్చివేతలో ఆ ఇద్దరికి మినహాయింపేమిటి?
- పదిహేను రోజుల గడువు దాటి పాతిక రోజులౌతోంది.
- ఆ రెండు కూల్చివేతలలో ఇంత కాలం జాప్యమేమిటి?
- సొసైటీ సెక్రటరీకి ఒక రూలు...ఆ నలుగురికి మరో రూలా?
- చిత్రపురిలో రాజకీయ నాయకుడికి రో హౌజ్ కేటాయింపేమిటి?
- బినామీ ఆస్థులు ఎంత కాలం దాస్తారు?
- నిబంధనలకు తూట్లెందుకు పొడుస్తున్నారు!
- ఆ రెండు కూల్చివేతలు ఆగడంలో అదృశ్య శక్తులెవరు?
- మణికొండ మున్సిపాలిటీని శాసిస్తున్నదెవరు?
- హైడ్రా తరహా కూల్చివేతలు జిల్లాల్లోనూ సాగుతున్నాయి!
- మణికొండ బుల్డోజర్లు ఆ రెండు రోహౌజ్‌ల వైపు ఎందుకు వెళ్లనంటున్నాయి?

ఎక్స్‌క్లూసివ్ నేటిధాత్రి exclusive

హైదరాబాద్,నేటిధాత్రి:

తవ్వినా కొద్ది చిత్రపురి హౌజింగ్ సొసైటీలో చిత్ర విచిత్ర దోపిడీ విన్యాసాలు బైటపడుతూనే వున్నాయి. కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగు చూస్తూనేవున్నాయి. చిత్ర పురి అంశం కొత్తదికాదు. దానిలో వున్న అగాదాలకు అంతం లేదు. అంతు లేదు. ఇంతకాలం వెలుగులోకి రాని అనేక అంశాలు నేటిధాత్రి వెలుగులోకి తెస్తూనే వుంది. నేటిధాత్రి రాసిన వరుస కథనాలతో చిత్రపురిలో జరిగిన అనేక అవకతవకలు బైటపడుతూనే వున్నాయి. తాజాగా రోహౌజ్‌ల విషయంలో కూడా సరికొత్త అంశాలు కనిపిస్తున్నాయి. చిత్రపురిలో 225 రోహౌజ్‌లకు అనుమతులున్నాయి. కాని అవి కార్మికుల కన్నీటి మీద నిర్మాణం చేసుకున్నవి. చట్టపరమైన అనుమతులున్నాయని చెప్పుకున్నా, కార్మికుల కష్టం దోచుకున్న పాపుల పాపాలకు సాక్ష్యాలు. అయితే 225 రోహౌజ్‌లతోపాటు ఓ ఆరు రోహౌజ్‌లు అదనంగా నిర్మాణం చేశారు. 225 రో హౌజ్‌లకు పర్మిషన్లు వున్నాయంటున్నారు. కాని మరో ఆరు రో హౌజ్‌లకు ఎలాంటి అనుమతులు అసలే లేవు. అక్కడ ఆ కట్టడాలకు ఎలాంటి అవకాశం లేదు. కాని నిర్మాణాలు చేశారు. రోహౌజ్‌లను నిర్మాణం చేసుకున్నారు. ఈ విషయాన్ని నేటిదాత్రి వెలుగులోకి ఎప్పుడో తెచ్చింది. దాంతో మణికొండ మున్సిపాలిటీ రంగంలోకి దిగింది. ఆరు రోహౌజ్‌ల కూల్చివేతకు రంగం సిద్దం చేసింది. కాని నాలుగు రో హౌస్‌లు మాత్రమే కూల్చి వేసింది. మరో రెండు రో హౌస్‌లను కూల్చివేయలేదు. ఆ రెండు ఎవరివని నేటిధాత్రి ఆరా తీస్తే అసలు విషయాలు వెలుగు చూశాయి. ఈ విషయాన్ని గతంలోనే మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అదికారిని నేటిదాత్రి ప్రశ్నించడం జరిగింది. ఆ నలుగురు చేసిన పాపం ఏమిటి? కూల్చని ఇద్దరు చేసిన పుణ్యం ఏమిటని నిలదీయడం జరిగింది. కొంత సమయం కావాలని ఆ రెండు రో హౌజ్‌లకు చెందిన యజమానులు కోరడంతో కనికరించామని చెప్పారు. అయితే ఎంతకాలం తర్వాత కూల్చివేతలు జరగొచ్చన్నదానిపై కూడా స్పష్టత కోరడం జరిగింది. ఓ పది హేను రోజుల సమయం ఇచ్చేందుకు అంగీకరించినట్లు అదికారులు చెప్పారు. కాని ఆ పదిహేను రోజుల సమయం ఎప్పుడో పూర్తయింది. అదనంగా మరో పాతిక రోజులు కూడా పూర్తవుతోంది.




మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి,చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

కాని రెండు రోహౌజ్‌ల జోలికి ఇంకా వెళ్లడంలేదు. కారణమేమిటని ఆరాతీస్తే ఒక రోహౌజ్ గత ప్రభుత్వంలో కీలకమైన నాయకుడుగా తెలుస్తోంది.

12 లో



# నేటిధాత్రి

వసంతాల అక్షరోద్యమం · 20 YEARS ANNIVERSARY · TELUGU DAILY



బుధవారం 16-10-2024 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 20 సంచిక : 169 రూ॥ 6.00





చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేంద్రరావు
9063524196, 9908658888















# ఆశకు పోతే అసలుకే మోసం

## బిచాణా ఎత్తేసినా కంపెనీల యాజమాన్యం




## డిపాజిటర్లు లబోదిబో

- కోట్లు వసూలు చేసి బిచాణా ఎత్తేసిన కంపెనీ
- ఎన్ని మోసాలు జరిగినా ప్రజల్లో మార్పు రాకపోవడం దౌర్భాగ్యం
- వెనకాముందూ చూడకుండా డిపాజిట్లు చేస్తే ఫలితాలిలాగే వుంటాయి
- ఎంతగా అవగాహన కలిగించినా చైతన్యం రాకపోతే నిండా మునగక తప్పదు

హైదరాబాద్,నేటిధాత్రి: ప్రజల నుంచి పెద్దమొత్తంలో డిపాజిట్ల రూపంలో వసూలు చేసి బిచాణా ఎత్తేసిన మరో కంపెనీ ఉదంతం హైదరాబాద్‌లో బయటపడింది. మొత్తం 17500 మంది నుంచి 229కోట్ల మేర డిపా జిట్ల రూపంలో వసూలు చేసి నిండా ముంచినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డికెజెడ్ టెక్నాలజీస్ కంపెనీ ఎం.డి. సయ్యద్ అష్ఫాక్ రహిల్ ఆయన భార్య సైదా అయిషా నాజ్‌లను హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేయడం తాజా పరిణామం. ఈ కంపెనీలో గత ఆగస్టులో రూ.2.74కోట్లు డిపాజిట్ చేసిన మెహదీపట్నానికి చెందిన ఒక డాక్టర్, డిపాజిట్లు సేకరించిన తర్వాత కంపెనీ మూసేసినట్టు తెలుసుకొని హతాశుడై చేసిన ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాది జనవరిలో కూడా ఒక ఫేక్ కంపెనీ ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో, ప్రలోభాలను చూపి మోసం చేయడంలో బాధితులు బషీర్‌బాగ్ పోలీసులను ఆశ్రయించిన సంఘటన కూడా చాలామందికి గుర్తుండే వుంటుంది. నిజం చెప్పాలంటే మన తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా ఇటువంటి మోసాలు జరుగు తున్నప్పటికీ, అవగాహన పెంచుకోని ప్రజలు పదే పదే ఇటువంటి మోసాలకు గురికావడం విచిత్రం! ఇటువంటి బాధితుల్లో విద్యావంతులు కూడా వుండటం ఇక్కడ విషాదం. ఒక పక్క పోలీసులు మరోపక్క మీడి యా ఇటువంటి నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలను హెచ్చరిస్తున్నప్పటికీ, ఫలితం వుండటంలేదనడానికి ఇదొక ఉదాహరణ. పోలీసులు కూడా ఇటువంటివారిపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చేస్తున్న సంఘటనలు మీడియాలో వస్తున్నా జనం వాటిని పెద్దగా పట్టించుకోవడంలేదనేది ఇటువంటి మోసాలు పదేపదే జరుగుతుండటాన్ని బట్టి తెలుస్తున్న నిజం. ప్రజల్లో ఇటువంటి మోసపోయే లక్షణం సమసిపోనంతవరకు మోసాలు జరుగుతూనే ఉంటాయి. అంటే మోసపోయేవాళ్లున్నంతకాలం, మోసంచేసేవాడు ఉంటూనే వుంటాడు. అటువంటి వారి కార్యకలాపాలు మూడు పువ్వులు,ఆరు కాయలుగా నిరాటంకంగా కొనసాగుతూనే వుంటుంది.

మానవుల్లోని సహజ బలహీనత డబ్బు! కష్టపడి సంపాదించే కంటే ఈజీ మనీకోసం వెంపర్లాడ టం ఎక్కువమంది నైజంగా మారింది. ఫలితంగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందాలన్న దురాశే ఇటువంటి మోసాల బారిన పడటానికి కారణమవుతోంది. ఎవరైనా ఒక కంపెనీ పేరుతో, ఎక్కడా లేనివిధంగా అత్యధిక రిటర్న్‌లు లేదా వడ్డీరూపంలో చెల్లిస్తామంటూ డిపాజిట్ల ను కోరుతున్నప్పుడు, మార్కెట్లో ఎక్కడా లేని విధంగా ఇంతటి మొత్తం ఎట్లా చెల్లించలగరన్న కనీస ఆలోచన డిపాజిట్ లేదా పెట్టుబడి పెట్టేముందు మదుపర్లకు కలగాలి! ఏదైనా ఒక ఆర్థిక లావాదేవీలో సహజ ప్రక్రియకు భిన్నంగా లేదా ప్రత్యేకంగా ఏదైనా కనిపిస్తే సదరు లావాదేవీని తక్షణం రద్దుచేయడం లేదా నిలిపివేయడం ద్వారా తాము కష్టపడి సంపాదించిన డబ్బును కాపాడుకోవచ్చు. కానీ ఇటువంటి నేరాలు పదేపదే జరుగుతున్నాయంటే అందుకు ప్రధాన కారణం ప్రజల్లో నెలకొన్న అత్యాస, అవగాహనా రాహిత్యం ప్రధాన కారణం. కుటుంబ అవసరాలు తీర్చుకోవడంలో ఎంతో పొదుపుగా జాగ్రత్తగా వ్యవహరించేవారు కూడా, వడ్డీ లేదా రాబడి ఆశతో ఇటువంటి ఉచ్చులో తేలిగ్గా పడిపోతున్నారు. మోసం చేసే తలంపుతో ఉన్నవాడికి జనం బలహీనత బాగా తెలుసు కాబట్టే తళుకు బెళుకుల వంటి ఆకర్షణలతో వారిని ఇట్టే మోసం చేయగలుగుతున్నారు. పోలీసులు పదేపదే ఇటువంటి మోసాలపై హెచ్చరిస్తున్నా పట్టించుకోకుండా గుడ్డిగా ముందుకెళ్లి చివరకు నెత్తికి చేతులు వచ్చిన తర్వాత, అదే పోలీసులను కాపాడమని ఆశ్రయించ డం ప్రస్తుత జరుగుతున్న తంతు. మీడియా కూడా ఎప్పటికప్పుడు ఇటువంటి మోసాలను హైలైట్ చేస్తూ అప్రమత్తం చేస్తున్నా, సామాన్యుల్లో ఇంకా మార్పు రావడంలేదు.

దీన్ని ప్రజల్లో నెలకొన్న మూర్ఖత్వమనాలా లేక అమాయకత్వమనాలా లేదా గొర్రెదాటుతనమనాలా తెలియడంలేదు.

ఒక జట్కాబండివాడు, గుర్రానికి ముందు కొంత పచ్చిగడ్డిని వేలాడదీయడం ద్వారా దానితో బండిలాగే పనిని చేయిస్తాడు. కంటికి కనిపిస్తున్న పచ్చిగడ్డికోసం అది పరుగెడుతూనే వుంటుంది. కానీ అది ఎప్పటికీ తన నోటికి అందదన్న జ్ఞానం గుర్రానికి వుండదు. ప్రస్తుతం గుడ్డిగా నమ్మి డిపాజిట్లు చేసి మోసపోతున్న వారు పరిస్థితి కూడా సరిగ్గా ఇదేమాదిరిగా వుంది. వడ్డీ ఆశ చూపి మొత్తాలను సేకరించిన మోసగాడు గుర్రం రౌతువంటివాడు. ఆ మొత్తంతో తన అవసరాలు తీర్చుకుంటాడు, కానీ వడ్డీ ఆశను మాత్రం జనాల్లో సజీవంగా వుంచుతాడు. ఎండమావిలాంటి వడ్డీ ఆశతో జనం జీవితం గడుపుతుంటే, మోసగాడు మాత్రం దర్జాగా కాలం గడిపేసి, ఒక మంచి రోజున, మొత్తం బిచాణా ఎత్తేస్తాడు. అప్పటికి కాని జనానికి తమ ఆశ అడియాసైందని తెలియదు! పోలీసులు తక్షణం రంగంలోకి దిగేందుకు వీలుగా, మీడియాను ఆశ్రయించి లబోదిబో మంటారు. పోలీసులు రంగంలోకి దిగి, నిందితులను అరెస్ట్ చేసినా, డిపాజిట్ మొత్తాల్లో ఎంతమేరకు రికవరీ జరుగుతుందో చెప్పడం చాలా కష్టం. చాలా సందర్భాల్లో నిందితులకు శిక్షలు పడినామదుపర్లకు వడ్డీ మాట దేవుడెరుగు, డిపాజిట్ చేసిన మొత్తాలు నష్టపోయిన సంఘటనలే అధికం.

డబ్బును కష్టపడి సంపాదించాలన్న ఉద్దేశం వున్నవారు ఇటువంటి మోసాల బారిన పడరు. ఎందుకంటే ఒక రూపాయి సంపాదించడంలో ఉన్న కష్టం వారికి తెలుసు. ప్రతి రూపాయిని ఎలా ఖర్చు చేయాలన్న దానిపై కూడా వారికి విస్పష్టమైన అవగాహన వుంటుంది. న్యాయ సంపాదన పై అవగాహన ఉన్నవారు, అధిక ఆదాయం పేరుతో చెప్పేవారి మాటలను ఎప్పుడూ విశ్వసించరు. వారెప్పుడూ తమ కష్టాన్నే నమ్ముకుంటారు. రుజుమార్గంలోనే వారు తమ డబ్బును భద్రపరచుకోవడంవల్ల వారి జీవితం ఒడిదుడుకులు లేకుండా నిశ్చింతగా సాగిపోతుంది. అతిగా ఆశపడేవారున్నంతకాలం, పెద్దఎత్తున మోసాలకు పాల్పడేవారు వీరిపై పరాన్నజీవుల్లాగా రాజుల్లాగా బతికేవాళ్లు వుంటారు. దొరకనంతకాలం దొంగ కూడా దొరనే. దొరికిన తర్వాత వారు జైలుకెళితే, డబ్బును పోగొ ట్టుకున్నవారు సమాజంలో వుంటూ కూడా మనోవ్యథతో బతుకులీడుస్తారు. అందువల్లనే ఒక కవి చెప్పినట్టు 'ఉన్ననాడు తెలివి కలిగి పొదుపు చేయాలి. లేని నాడు ఒళ్లు వొంచి కష్టపడాలి' అన్నది అక్షర సత్యం. కానీ ఇటువంటి తప్పుడు ప్రకటనలకు మోసపోయి పొదుపు చేస్తే అసలుకే మోసం వస్తుంది. పోయిన డబ్బు సంపాదించుకోవచ్చు. కానీ అంత డబ్బు సంపాదించిన కాలం తిరిగి రాదు కదా!

మోసంచేసే ఉద్దేశంతో ఉన్నవాడు, చట్టంలోని లసుగులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ఇందు లోకి ప్రవేశించిన తర్వాత, తప్పుకునే మార్గాన్ని కూడా నిర్ణయించుకొని మరీ రంగంలోకి దిగుతా డు. జనాల బలహీనతలపై కూడా స్పష్టమైన అవగాహనతో, ఒక నిర్దిష్ట ప్రణాళికతో తన పథకా న్ని పకడ్బందీగా అమలుచేసి, విజయవంతంగా బోర్డు తిప్పేస్తాడు. అందువల్లనే మోసగాళ్ల సం ఖ్య ఎప్పుడూ తక్కువగానే వుంటుంది. కానీ మోసపోయేవారి సంఖ్య అపరిమితం! ఇంతమంది సొమ్ము ఒక్కడి చేతిలోకి వెళ్లడంతో లక్షలు సమకూరుతాయి. వీధినపడేది సామాన్యులు! చీమలు పెట్టిన పుట్టలోకి పాములు దూరడమంటే ఇదే. జనాలను సక్రమ మార్గంలో నడిపించే నిజాయతీ గల నాయకులు చాలా తక్కువమంది వుంటారు. కానీ మోసం చేసేవారు అడుగడుగునా వై కుంఠపాళిలో పాముల మాదిరిగా కాటువేయడానికి ఎప్పుడూ పొంచివుంటారు. మోసమనేది అటువంటివారికి అవకాశంగా మారితే, మోసపోవడం జనాలకు దౌర్భాగ్యంగా చుట్టుకుంటుంది. విధివశాత్తు లేదా ప్రకృతి వైపరీత్యం వల్ల కలిగే కష్టనష్టాలు అందరినీ వెంటాడుతూనే వుంటాయి. వాటిని మనం 'తలరాత'గా సరిపెట్టుకుంటాం. కానీ కోరికోరి తెచ్చుకున్న ఇటువంటి కష్టాలు మాత్రం 'మనం రాసుకున్న తలరాత'.

ఎక్కడ తగ్గాలో తెలిసినవాడు నాయకుడైతే, ఎక్కడ మదుపు చేయాలో తెలిసినవాడు విజ్ఞుడు. ఎ ట్లా మోసం చేయాలో తెలిసినవాడు ధూర్తుడు. ఇటువంటి ధూర్తులను పదేపదే నమ్మి మోసపో తుండటం వల్లనే 'గొర్రెదాటు ప్రజలు' అనే నానుడు ప్రచారంలోకి వచ్చింది. ఈ సందర్భంగా ఇద్దరు ప్రఖ్యాతు వ్యక్తులు చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకోవడం అవసరం. మొదటిది కాళిదాసు కాగా రెండవ వాడు జార్జ్ బెర్నార్డ్‌షా. తెలివిగలవాడు అనుభవం ద్వారా నేర్చుకుంటాడని కాళి దాసు చెప్పగా, తెలివైనవాడు ఇతరుల అనుభవాలనుంచి నేర్చుకుంటాడని జార్జ్ బెర్నార్డ్‌షా చెప్పా డు. రెండూ కరెక్టే. సమయానుకూలంగా ఈ రెండు సూత్రాలు జీవితంలో పాఠాలు నేర్పిస్తాయి. దురదృష్టవశాత్తు ప్రజలు ఈ రెండు సూత్రాలను విస్మరించడం వల్లనే, వివిధ రకాల మోసాల బారిన పడటానికి ప్రధాన కారణం.

నీ లక్ష్యం ధర్మమైనప్పుడు దాని సాధనలో శత్రువును మభ్యపెట్టడంలో తప్పులేదని భగవాన్ శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పారు. కానీ మోసగాళ్లు దీన్ని తప్పుగా అన్వయించి, ఏకంగా ఇతరులను మోసం చేయడానికే మభ్యపెట్టే పనులకు పాల్పడుతున్నారు. మోసపోవడం తప్పు కాదు...కానీ మళ్లీమళ్లీ మోసపోవడమే తప్పు! మళ్లీ మోసపోతున్నారంటే, గత అనుభవం నుంచి పాఠం నేర్చుకో లేదనే అర్థం. ఇది సాధారణ జనం చేసే తప్పిదం. ఇందులో పండితులు, పామరులు అనే తేడా లేదు. మోసం ఒక గారడి లాంటిదైతే, తెలివి దాన్ని తిప్పికొట్టే సాధనం. ప్రజలు ఈ తెలివి అనే సాధనాన్ని ప్రయోగించడం తెలుసుకునేవరకు ఇటువంటి మోసాలు తప్పవు.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

FOLLOW US neti_dhatri
WATCH US Netidhatri TV
FOLLOW US netidhatri
FOLLOW US Netidhatri News


నేటిధాత్రి
జిల్లాల అనుబంధం
16-10-2024 బుధవారం

# చెరువులో యువకుడి మృతదేహం లభ్యం



రాజన్న జిల్లా, నేటిధాత్రి :
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయ చెరువులో వేములవాడ పట్టణంలోని శాస్త్రి నగర్ కు చెందిన మైత్రి నవీన్( 19)అనే యువకుని మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నారు. సంఘటనకు సంబంధించిన వివరాలు కూడా సేకరిస్తున్నారు. యువకుడు ఈత కొట్టడానికి చెరువులో దూకి ప్రమాదవశాత్తు మృతి చెందడా లేక ఏమైనా కారణాలు ఉన్నాయా అనే విధంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# శబరిమలకు మహా పాదయాత్ర



నేటిధాత్రి, కథలాపూర్ :
మెట్పల్లి నుండి శబరిమలకు అయ్యప్ప స్వాములు పాదయాత్ర చేపట్టారు. సుమారు 1600 కిలోమీటర్లు ఈ పాదయాత్ర ఉన్నట్లు గురుస్వామి పోతు గంటి రాజేందర్ తెలిపారు. రాజేందర్ గురుస్వామి ఆధ్వర్యంలో మొదటిసారి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు, దీనికిగాను 40 మంది స్వాములను పాదయా త్రలకు తీసుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్ర మెట్పల్లి వేములవాడ సిరిసిల్ల బెంగళూరు నుండి శబరిమ లకు బయలుదేరినట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో మధ్య మధ్యలో ఎవరైనా దాతలు ఉంటే సహాయం చేకూరుస్తారు లేదంటే నా సొంతంగా తీసుకెళ్తానని నిశ్చయించుకున్నట్లు పోతుగంటి రాజేందర్ తెలిపారు. ఇది సుమారు జనవరి 5 వరకు అక్కడ చేరుకుంటామని తెలిపారు. కథలాపూర్ మండల అయ్యప్ప భక్తులు వారికి స్వాగతం పలికి తేనీరు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ఆమెటి గంగాధర్, శివ, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ పీసా చట్టం ద్వారా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక జరగాలి



భద్రాచలం, నేటిధాత్రి :
చర్ల మంగళవారం నాడు బస్టాండ్ కేంద్రం లో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూణెంవర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్తు రాష్ట్ర అధ్యక్షు లు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో ఏ ప్రభుత్వ పథకాలైన అర్హులైన లబ్ధిదారుల ఎంపిక జరగాలంటే షెడ్యూలు ప్రాంత చట్టా లపై అధికారులు విశ్లేషణ చేసి ముఖ్యంగా ఆదివాసీలకున్న అక్కురైట్ పై పార్లమెంటు పేషా చట్టం ద్వారా ఇందిరమ్మ గ్రామసభలు జరగాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీ లోకి చట్ట విరుద్ధంగా వలసలు వచ్చిన గిరిజ నేతరులకు ఏ చట్టం ప్రాతిపదికన పథకాలు మంజూరు చేస్తారని అన్నారు 1970 కి ముందు ఏజెన్సీలో నివాసం ఉన్న గిరిజనేత ర్లకు మేము వ్యతిరేకం కాదని గడిచిన రెండు దశాబ్దాల కాలంలో ఏజెన్సీలోకి గిరిజ నేతర వలసలు విపరీతంగా పెరిగిపోయాయని ఏజెన్సీ రూపురేఖలను చిన్నబిన్నం చేస్తున్నారని వివిధ పార్టీలలో చోటామోటా నాయకులు సేరి ఆదివాసీల హక్కులకు వి ఘూతం కలిగిస్తున్నారని ఆరోపించారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఆయామ్లో నిర్మించిన డబుల్ బెడ్ రూములు భద్రాచలంలో అర్హులైన ఆదివాసీలను ఎంపిక చేసినప్పటికీ కెసిఆర్ కాలనీలో గజనేతర వ్యాపార వర్గాల వారు ఇల్లులున్న వలస గిరిజనేతరులు దర్జాగా డబుల్ బెడ్ రూములలో నివాసం ఉంటున్నారని ఆరోపించారు ఈ కార్యక్రమంలో కొరసనవిన్ దుబ్బ రాజు కణితి శ్రీను వట్టం మహేష్ తదితరులు.

# మద్ది కాయల ఓంకార్ 16వ వర్ధంతి సదస్సులను జయప్రదం చేయండి



బెల్లంపల్లి, నేటిధాత్రి :
బెల్లంపల్లి నియోజకవర్గం ఎంసిపియు వ్యవస్థాపక నేత అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ ఎక్స్ ఎమ్మెల్యే 16వ వర్ధంతి సందర్భంగా ఎం సిపియు పార్టీ ఆఫీసులో కరపత్రాల విడుదల ప్రస్తుత రాజకీయాలు అంబేద్కర్ ఆలోచన విధానం అనే అంశంపై అక్టోబర్ 17 నుండి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగు సభలు సదస్సులను జయప్రదం చేయండి కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ఫాసిస్టు, మనువాద విధానాలకు, సెక్యులర్ ముసుగులో ఉన్న కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా కార్పొరేట్,కష్టపడి దారి ఆధిక విధానాన్ని కొనసాగిస్తున్న దోపిడీ పాలకవర్గాల పాలనలో సమస్త హక్కులు కోల్పోతున్న శ్రామిక వర్గా ఐక్య పోరాటాల బలోపేతానికి మార్క్సిజమే మార్గ దిశగా, తరతరాలుగా అసమానులతో అణిగిమనిగి ఉన్న భారత సమాజాన్ని అంబేద్కర్ ఆలోచన విధానంతో నిర్మూలించే దిశగా రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని, బహుజనులకు రాజ్యాధికారాన్ని కాంక్షిస్తూ అమరజీవి కామ్రేడ్ మధ్య కాయల ఓంకార్ 16వ వర్ధంతి కార్యక్రమాన్ని ఎం సిపిఐయు రాష్ట్ర వ్యాప్తంగా 2024 అక్టోబర్ 17 నుండి 31 వరకు " ప్రస్తుత రాజకీయాలు మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానం అనే అంశంపై జరుపుతున్న కార్యక్రమాలను జయప్రదం చేయాలని అన్ని వర్గాల ప్రజలకు ఏం సిపిఐయు తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తోంది. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ యు పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి ఎంసీపీ పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ ఎంసీపీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ ఎంసీపీ జిల్లా కమిటీ సభ్యులు కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



తంగళ్ళపల్లి. నేటిధాత్రి:
తంగళ్ళపల్లి మండలం చిన్న లింగాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ చిన్న లింగాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుర్రం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన రేగుల జ్యోతి కి 27 వేల రూపాయలు చెప్యాలా లతకి 21000 రమ్యకి 5500 ముఖ్యమంత్రి సహాయ నిధి తరపున లబ్ధిదారులకు అందజేశా మని ఈ సందర్భంగా తెలియజేస్తూ నిరు పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న నిరుపేదలకు వైద్య ఖర్చులకు ఎంతో ఉపయోగపడు తుందని రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు ఇట్టి సహాయనిధికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్కి ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్కి కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రవీణ్ కి మాజీ ఎంపీటీసీ బై రీ నేని రాముకి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఇట్టి కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ నారాయణ గౌడ్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరాములు వెంకటేష్ రేగుల ఎల్లయ్య బోలవేణి అనిల్ మరిపల్లి మల్లికార్జున్ గుర్రం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వాసం చూపించిన శునకం

## తుమ్మేటి సమ్మిరెడ్డి పెంపుడు కుక్క మృతి.



జమ్మికుంట, నేటిధాత్రి :
జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుమ్మేటి సమ్మెరెడ్డి నెల రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. నెల రోజుల క్రితం సమ్మిరెడ్డి మృతితో అతని పెంపుడు కుక్క ప్రతిరోజు దిగాలు పడుతూ సమ్మిరెడ్డి చిత్రపటం వద్ద కన్నీళ్లు పెట్టుకుంటూ కనిపిస్తూ వచ్చింది. మనుషులలో లేని విశ్వాసం కుక్క లో ఉండడం పలువురిని ఆశ్చర్యపరిచింది. విశ్వాసానికి మారుపేరైన సమ్మిరెడ్డి పెంపుడు కుక్క సోమ వారం మృతి చెందింది. సమ్మిరెడ్డి మృతి చెందిన నెల రోజులకు కుక్క మృతి చెందడం ఆ కుటుంబ సభ్యులను తీవ్ర మనస్థాపానికి గురి చేసింది. ఓవైపు సమ్మిరెడ్డి మృతి నుండి కుటుంబ సభ్యులు బయటపడకముందే వారి కనుల ముందే ఆయన పెంపుడు కుక్క మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు సమ్మిరెడ్డి అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కకు ఉన్న విశ్వాసం మనుషులకు లేదని సమ్మిరెడ్డి తో లబ్ధి పొందిన వారు కూడా ఆయనను మర్చిపోయిన ఆయన ఉప్పు తిన్న విశ్వాసానికి ఆ కుక్క మాత్రం దిగాలుతో మృతి చెందడం పలు వురిని కంటతడి పెట్టించింది.

# రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డిని కలిసిన జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు



భద్రాచలం, నేటిధాత్రి :
చీఫ్ మినిస్టర్స్ కప్ 20 24 కార్యక్రమం లో భాగంగా రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివ సేన రెడ్డి ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు క్రాస్ రోడ్ దగ్గర ఉన్నటు వంటి సెంట్రల్ పార్క్ వద్ద నుంచి ప్రకా శం స్టేడియం వరకు జరిగిన టార్చ్ రిలే ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా విచ్చేయ డం జరిగింది. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి, మరియు సభ్యులుఈ కార్యక్రమంలో పాల్గొని శివసేన రెడ్డితో మాట్లాడడం జరిగింది. అట్లానే టార్చ్ రిలే ప్రోగ్రాంలో జితేష్ వి పాటిల్ని, జిల్లా ఎస్పీ ఐపీఎస్ రోహిత్ రాజు ని కలిసి ఈ సందర్భంగా ముచ్చటించడం జరిగింది. ఈ సందర్భంగా స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో మత్తు పానీయాలు డ్రగ్స్ ఇటువంటి వాటికి యువత బానిసవుతున్నటువంటి క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి క్రీడా రంగాన్ని ప్రోత్సహించినట్లయితే యువత చెడు మార్గం నుంచి క్రీడల ద్వారా ఫిట్నెస్ మరియు క్రీడా పరంగా ముందుకెళ్లే అవకాశం ఉంటుందని భావించి సీఎం కప్ 20 24 ను ప్రారంభించడం జరిగిందనితెలిపారు.

# నాణ్యత పాటించని హోటల్స్, రెస్టారెంట్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

## నాణ్యత ప్రమాణాలు పాటించని మైత్రి హోటల్ పై వెంటనే కేసు నమోదు చేయాలి – బ్రాహ్మణపల్లి యుగంధర్



కరీంనగర్, నేటిధాత్రి:
కరీంనగర్ నగరంలో చాలా హోటల్ లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్ లు కల్తీ వస్తువులను తయారీలో వాడు తూ ప్రజలను అనారోగ్యాలకు గురిచేస్తు న్నారని వీటిపై ప్రభుత్వం తనిఖీలు చేసి కల్తీ ఆహారం తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో ఫుడ్ అధికారుల కొరత ఉ ందని ఒక అధికారి పది జిల్లాలకు ఇంచార్జిగా వుండడం వల్ల వ్యాపారస్తులు ఇష్టారా జ్యంగా వ్యవరిస్తున్నారని వెంటనే ఫుడ్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఆహార పదార్థాలు నాణ్యత లేకున్న ఇష్టం వచ్చినట్లు రేట్లు పెంచి ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫుడ్ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారని దీంతో హోటల్ యజమానులు యదేచ్ఛగా మళ్లీ కుళ్ళిపోయిన వంటలను వండుతున్నారని నిత్యం తనిఖీలు లేకపోవడం వల్ల ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న మైత్రి హోటల్లో తనిఖీలు చేసిన అధికారులు తూతూ మంత్రంగా వ్యవహరించారని వెంటనే కేసు నమోదు చేయాలని కోరారు. ఎక్కడ హోటల్స్, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ స్థలం లేదని ఇష్టం వచ్చినట్లు రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్న ట్రాఫిక్ పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు.
వెంటనే అధికారులు నాణ్యత, అధిక ధరలు వసూలు చేస్తున్న హోటల్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్, రెస్టారెంట్ లపై తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని యుగంధర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ను వెంటనే విడుదల చేయాలి



భూపాలపల్లి, నేటిధాత్రి :
తెలంగాణ ప్రభుత్వం గత మూడు సంవ త్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను విడుదల చేయకుండా విద్యా ర్థులకు నానా ఇబ్బందులు గురిచేస్తూనేఉ ంది దీని నిరసిస్తూ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్డిఓకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి శిలపాక నరేష్ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పట్టణ కార్యదర్శి చంద్రగిరి శంకర్ మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మొత్తం బకాయిలను ఒకేసారి విడుదల చేస్తామని చెప్పిన ముఖ్య మంత్రి పది నెలలు గడుస్తున్న ఇప్పటివరకు ఎలాంటి ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చెయ్యలేదు, మరోపక్క గత మూడు సంవ త్సరాల నుంచి ఫీజు రియంబర్స్మెంట్ రాక కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి పూర్తిస్థా యిలో జీతాలు చెల్లించలేక , ప్రైవేటు డిగ్రీ ,పీజీ కళాశాలలు అద్దె భవనాల్లో కొనసాగు తున్న వాటి అద్దె చెల్లించ లేకుండా నాన్న యాతన పడుతాం పడుతూ కళాశాల నడుపుతుంటే వారు కూడా నిన్నటి నుండి రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ పీజీ కళాశాలల బందుకు పూనుకోవడం జరిగిందని.. అయినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తకుండా వివరిస్తున్నది. ఒకపక్క విద్యార్థులు వారి తల్లిదండ్రులు వారి భవిష్యత్తు పట్ల ఆందోళన చెందుతుంటే, రానున్న రోజుల్లో సెమిస్టర్ పరీక్షల దగ్గరకు వస్తున్న సందర్భంలో తరగతులు నిర్వహణ లేక విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోయే పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుంది.. ఇలాంటి వాటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రియం బర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేనటువంటి పక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాం.

# ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి



జమ్మికుంట, నేటిధాత్రి :
జమ్మికుంట పట్టణంలో ప్రొఫెసర్ సాయి బాబాకు మానవ హక్కుల వేదిక ఆధ్వ ర్యంలో క్రొవత్తులతో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా వేదికలనుపెట్టి, సమాజాన్ని చైతన్య పరచడం కోసం కృషి చేసిన వ్యక్తి, అర్బన్ నక్సలైట్గా ద్రోహం మోపి, కనీసం వికలాంగుడు అనికూడాచూ డకుండాదుర్భ రమైనటువంటి జైల్లో నిర్బంధించడం వలన, అనారోగ్యం పాల య్యారని పేర్కొన్నారు. 10 సంవత్సరా లు జైలు జీవితం అనుభవించిన తర్వా త, కోర్టులో అతన్ని నిర్దోషి అని నిర్ధారిం చినప్పటికీ అతనిని మానసికంగా ప్రభుత్వం చేసిన హత్యనిఅనివిమ ర్శించారు.సాయిబాబా గత కొన్ని రోజు లుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అనారోగ్యముతో జీవితాన్ని ముగిం చడం ప్రజాస్వామ్యవాదులకు తీరనిలో టు అని వక్తలు పేర్కొన్నారు. ప్రజా సంఘాలకు మద్దతు తెలుపుతూ తెలంగాణ కోసం మొదటిసారిగా వరంగల్ డిక్లరేషన్ లో మద్దతు తెలుపడం జరిగిందని, పీడిత , తాడిత , ఆదివాసుల హక్కుల కోసం నిరంతరం కృషి చేసాడని, తెలంగాణ వాదిని కోల్పోవడం చాలా బాధాకరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి తిరుపతయ్య, కార్మిక నాయకుడు సామ్రాజ్యం, డిటిఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి, గాయకులు భరత్ , మర్రి అవినాష్,ఏబూసి శ్రీనివాస్, ప్రజా ఐక్యవేదిక సంఘల నాయకులు పాత సత్యం, ఓల్లాల శ్రీనివాస్, మారేపెల్లి మొగిలి, దొడ్డే సమ్మయ్య , నాయకులు పాల్గొని ప్రొఫెసర్ సాయిబాబా మరణం దేశానికే తీరని లోటుఅని ఘన నివాళులు అర్పించారు.

# మోడల్ స్కూల్ నూతన ప్రిన్సిపల్గా సిహెచ్ పూర్ణచంద్రరావు



మలహార్ రావు, నేటిధాత్రి :
భూపాలపల్లి జిల్లాలోని మల్హర్ రావు మండలం ఎడ్లపల్లి మోడల్ స్కూల్ నూతన ప్రిన్సిపల్గా మంగళవారం సిహెచ్. పూర్ణచంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల పాఠశాల నుంచి ఎడ్లపల్లి పాఠశాలకు బదిలీ అయి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలో నీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతుల, ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం మెరుగుపరుస్తామని మొదలగు విషయంలో బాధ్యతతో కూడిన విధులు నిర్వహిస్తానని తెలియజేయడం జరిగింది.

# గర్భిణీ స్త్రీలకు నరకం చూపిస్తున్న హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి



కరీంనగర్ జిల్లా నేటిధాత్రి :
కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఏరియా దవాఖానలో ఇప్పుడు వైద్య లేక గర్భిణీ స్త్రీలు కునారిల్లుతున్నారు.ప్రతి నెలా 180 నుంచి 200 కాన్పులు చేసి రికార్డులు సృష్టించిన ఈ దవాఖానకు ఇప్పుడు కాన్పులకు వెళ్లా లంటేనే గర్భిణులు హడలిపోతున్నారు. మత్తు డాక్టర్ అందుబాటులో లేక గంటల తరబడి పురిటి నొప్పులు భరిస్తూ నరకయా తన పడుతున్నారు. సోమవారం ఆరుగురు గర్భిణులకు కాన్పులు చేయకపోవడంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయం త్రం 6.30 గంటల వరకు వారంతా నరకం చూశారు. వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు గర్భిణులు సోమవారం ఉదయం 8 గంటలకు దవాఖానకు వచ్చారు. 12 గంటలకు ఆపరేషన్ చేసేందుకు సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ, మత్తు వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో ఆయన వచ్చే వరకు వారు అలానే బెడ్పై ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారికి యూరిన్ కేథటర్ వేయడం, నొప్పులు పెరగడంతో గర్భిణుల అవస్థలు అన్నీ ఇన్నీకావు. ఏడు గంటలపాటు వారంతా నరకం అనుభవించారు.
ఈ క్రమంలో ఓ గర్భిణి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య డ్యూటీ డాక్టర్ ఒకసారి వచ్చి పరిస్థితిని చూశారు. మత్తు వైద్యులు లేరని, వచ్చిన తర్వాత ఆపరేషన్లు చేస్తామని చెప్పి వెళ్లిపోయారు. దీంతో గర్భిణుల బంధువులు మీడియాకు సమాచారం ఇచ్చారు.
మీడియా అక్కడికి రావడం, బంధువులు ఆందోళనకు దిగితే తప్ప వైద్యుల్లో కదలిక రాలేదు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో మత్తు వైద్యుడిని పిలిపించి రాత్రి 8:30 గంటలకు కాన్పులు చేశారు.

# పద్మశాలీయుల ఆడపడుచుకు పట్టువస్త్రాలు-ఓడిబియ్యం సమర్పణ

## సిరిసిల్లలో ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు



సిరిసిల్ల, (నేటిధాత్రి ):
సిరిసిల్ల పద్మశాలి సంఘం వారి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి-పద్మావతి అమ్మవార్లకు ఒడిబియ్యం మరియు పట్టు వస్త్రాలు సమర్పించు కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివారికి ఒడిబియ్యం మరియు పట్టు వస్త్రాలను సమర్పించారు.
ఈ సందర్భంగా పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ కొన్ని వందల సంవత్సరాలుగా సిరిసిల్ల ప్రజల ఆరాధ్య దైవంగా కొలువబడుతూ నిత్యం పూజలు అందుకుంటున్న శ్రీ శాల లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడ సిరిసిల్ల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో స్వామివారికి పూజలు నిర్వహించి ఒడిబియ్యం సిద్ధం చేసుకుని ఒడిబియ్యం పట్టు వస్త్రాలతో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయం నుండి వేద పండితులు భాజా భజంత్రీలు మధ్య వైభవంగా బయలుదేరి శ్రీ శాల లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చేరుకొని పద్మశాలి ఆడబిడ్డ పద్మావతి అమ్మవారికి ఒడిబియ్యం మరియు స్వామివారికి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించుకోవడం జరిగిందని ఈల ఎంతో వైభవంగా భావితరాలకు మన సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేసేలా సిరిసిల్ల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈ ఒడిబియ్యం పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పద్మశాలి సంఘం అధ్యక్షులు గోలి వెంకటరమణ మరియు కార్యవర్గ సభ్యులకు పద్మశాలి కుల బాంధవులకు ఈ సందర్భంగా మా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు..
అదేవిధంగా బ్రహ్మోత్సవాలలో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ముఖ్యంగా రథోత్సవం సందర్భంగా పురపాలక సంఘం ద్వారా చేపట్టాల్సిన అన్ని చర్యలు చేపడుతూ ఇట్టి బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అధికారులు మరియు సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. భక్తులందరూ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరుతూ అందరికీ శ్రీ శాల లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి రథోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షులు గోలి వెంకటరమణ మాట్లాడుతూ పద్మశాలి ఆడపడచైన పద్మావతి అమ్మవారికి సిరిసిల్ల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి కుల బాంధవులు ఆడపడుచులు పెద్ద సంఖ్యలో మార్కండేయ స్వామి దేవాలయం నుండి ఒడి బియ్యం పట్టు వస్త్రాలతో ఊరేగింపుగా బయలుదేరి వచ్చి శ్రీ శాల లక్ష్మీ వెంకటే శ్వర స్వామి వారికి పద్మావతి అమ్మవారికి శాస్త్రీయ పద్ధతుల్లో ఒడి బియ్యం పట్టు వస్త్రాలను సమర్పించడం జరిగిందని అన్నారు. అలాగే బ్రహ్మోత్సవాలను రాబోయే రథోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సభ్యులు పత్తిపాక పద్మ, గుడ్ల శ్రీనివాస్, దార్నం అరుణ లక్ష్మీనారాయణ, గెంట్యాల శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, సిరిసిల్ల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ గాజుల బాలయ్య, మోర రవి, యువజన విభాగం అధ్యక్షులు గుండ్లపల్లి పూర్ణచందర్, మహిళా విభాగ అధ్యక్షురాలు కాముని వనిత, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడపు రవీందర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సంగీతం శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, పద్మశాలి కుల బాంధవులు, దేవాలయం మాజీ అధ్యక్షులు ఉప్పుల విట్టల్ రెడ్డి, మాజీ ధర్మకర్తలు, పుర ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో రాజకీయాలు తగవు



**హైదరాబాద్,నేటిధాత్రి:**
పార్టీలు వేరైనా దేశాభివృద్ధిలో అందరూ కలిసి ముందుకెళ్లాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వు ఫారెస్టులో రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో రక్షణ మంత్రి ప్రసంగించారు. అబ్దుల్ కలాం జయంతి నాడు వీఎల్ఎఫ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రాజెక్టుకు ఏర్పాటుకు అన్ని విధాలా అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుందని, దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందన్నారు. దేశ భద్రత విషయంలో వీఎల్ఎఫ్ పాత్ర కీలకమన్నారు. కమ్యూనికేషన్ విషయంలో ఈ కమాండ్ సెంటర్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. కమ్యూనికేషన్ విషయంలో భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలి. సాంకేతికయుగంలో కమ్యూనికేషన్ అనేక రకాలుగా ఉపయోగ పడుతుంది. కమ్యూనికేషన్ రంగంలో పావురాలు, గుర్రాల నుంచి ఇక్కడి వరకు వచ్చాం. తపాలా వ్యవస్థను అనేక ఏళ్లుగా వినియోగించుకున్నాం. ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగం.. సమాచారం క్షణాల్లో చేరుతోంది. సమాచార విప్లవం.. ఇవాళ అనేక దేశాలను దగ్గర చేస్తోంది. విద్య, వైద్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఇంట్లో కూర్చునే అనేక కోర్సులు నేర్చుకునే అవకాశం వచ్చింది. వీఎల్ఎఫ్‌కు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు అన్నారు. నావికారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవడం అనివార్యం. ఇండోపసిఫిక్ ప్రాంతంలో పుష్కలంగా ఖనిజ సంపద ఉంది. సముద్రంపై ఆధిపత్యం సాధించిన వాళ్లే మరింత అభివృద్ధి చెందుతారు. సముద్రంపై ఆధిపత్యం ఆంగ్లేయుల విస్తరణకు ఎంతో ఉపయోగపడింది. అత్యాధునిక పరికరాల ద్వారా రక్షణరంగాన్ని బలోపేతం చేస్తాం. దేశ రక్షణ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోము. దేశ రక్షణ, భద్రత విషయంలో ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గం. వీఎల్ఎఫ్ వల్ల స్థానికులపై ఎలాంటి చెడు ప్రభావం ఉండదు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కేంద్రాన్ని మూడేళ్లలో పూర్తి చేసేందుకు కేంద్రం ప్లాన్ రెడీ చేసింది. వెరీ లో ఫ్రీక్వెన్సీ నేవీ రాడార్ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటుకు ఎప్పుడో కేంద్రం ఓకే చెప్పింది. ఇన్ని రోజులకు మంగళవారం భూమిపూజ జరిగింది. మధ్యాహ్నం 12 గంటల 55 నిముషాలకు భూమిపూజ జరిగింది. దేశంలోనే అతిపెద్ద రెండో వీఎల్ఎఫ్ నేవీ రాడార్ సెంటర్‌గా దీన్ని 2027 నాటికి పూర్తి చేయాలని కేంద్రం సంకల్పించింది. దీని నిర్మాణానికి 2,900 ఎకరాల అటవీ భూమిని ఈస్టర్న్ నావెల్ కమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ భూమి అప్పగింతతో ఇక్కడ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు మార్గం సులభమైంది. ఈ రాడార్‌లో సదుపాయాలు కల్పించేందుకు ఈ అటవీ ప్రాంతం చుట్టూ దాదాపు 24 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తారు. ఇప్పుడు శంకుస్థాపన చేసిన ప్రాంతంలో రాడార్ స్టేషన్‌తోపాటు 2500 మంది నివాసం ఉండేలా టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. అందులో స్కూల్స్, హాస్పిటల్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ఇక్కడ దాదాపు 500 మందికిపైగా నేవీ ఉద్యోగులు, ఇతర సిబ్బంది పని చేస్తారు. రాడార్ కేంద్రానికి శంకుస్థాపన చేసిన తర్వాత వికారాబాద్ పూడూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశ రక్షణలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోందన్నారు. దేశ
రక్షణకు సంబంధించి కీలకమైన డిఫెన్స్, ఎన్.ఎఫ్.సీ లాంటి కేంద్రాలకు హైదరాబాద్ గుర్తింపు పొందింది. కొందరు వీఎల్ఎఫ్‌ను వివాదం చేస్తున్నారు. వీఎల్ఎఫ్‌తో ప్రజలకు అన్యాయం జరుగుతుందని అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. తమిళనాడులోనూ 1990లో ఇలాంటిదే ప్రారంభించారు. అక్కడి ప్రజలకు ఎలాంటి నష్టం జరగలేదు. దేశంలో రెండో వీఎల్ఎఫ్ మన ప్రాంతంలో రావడం గర్వకారణమని అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను తెలంగాణ సమాజం గుర్తించాలి. వివాదాలకు తెరలేపుతున్నవారు దేశ రక్షణ గురించి ఆలోచన చేయాలి. దేశం ఉంటేనే మనం ఉంటాం.. మనం ఉంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. దేశ రక్షణ కోసం ఏర్పాటు చేసే ప్రాజెక్టులను కూడా రాజకీయాల మోసం వివాదం చేసేవారికి కనువిప్పు కలగాలి. 2017లోనే భూ బదలాయింపు, నిధుల కేటాయింపు లాంటి పూర్తి నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయని తెలియజేశారు. 'ప్రాజెక్టును ప్రారంభించాలని రాజ్ నాథ్ సింగ్ అడగ్గానే మేం కొనసాగించాం. దేశ రక్షణ విషయంలో రాజీ పడొద్దనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించా.. పర్యావరణ ప్రేమికులకు నేను ఒకటే చెబుతున్నా... దేశం, దేశ ప్రజలు సురక్షితంగా ఉంటేనే పర్యావరణ రక్షణ గురించి ఆలోచించగలం... దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్ట్ ను వివాదాస్పదం చేయడం సమంజసం కాదు.. ఎన్నికలప్పుడు మాత్రమే పార్టీలు, రాజకీయాలు... దేశ రక్షణ విషయంలో కలిసికట్టుగా ముందుకెళ్లాలి. వీఎల్ఎఫ్ ను ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని తెలిపారు. రాడార్ ఏర్పాటు ప్రాంతంలో గుడికి వచ్చేందుకు ప్రజలకు అనుమతి ఇవ్వాలని రాజ్‌నాథ్‌కు విజ్ఞప్తి చేశారు. ' ఇక్కడ ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చేవారిని అనుమతించాలని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేస్తున్నా. ఆలయానికి ఇబ్బందులు కలిగించొద్దని కోరుతున్నా.. ప్రజల సెంటిమెంట్, విశ్వాసాన్ని గౌరవించి ఆలయానికి వెళ్లేందుకు దారి ఇవ్వాలని కోరుతున్నా.. ఈ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే విద్యా సంస్థల్లో ఈ ప్రాంత ప్రజలకు 1/3వ వంతు సీట్లు కేటాయించాలని రేవంత్ రెడ్డి రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. దేశ భద్రత విషయంలో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రాంతమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మన పార్టీలు వేరు కావొచ్చు.. సిద్ధాంతాలు వేరు కావొచ్చు. దేశ భద్రత, రక్షణ విషయంలో మేం ఎప్పుడూ మీతో కలిసి వస్తాం. దేశ రక్షణ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరుంది. వీఎల్ఎఫ్ ఏర్పాటుకు అత్యంత వ్యూహాత్మక ప్రాంతం వికారాబాద్ జిల్లా. కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తూ వివాదాలకు తెరలేపుతు న్నారు. దేశ భద్రత ప్రాజెక్టులకు రాజకీయం చేయడం సరికాదు. ఈ ప్రాజెక్టుకు భారాస ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చింది. దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయనివ్వం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తదితరులు కూడా పాల్గొన్నారు.

## ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లు



**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
నాలుగేళ్లకు ఒకసారి జరిగే వరల్డ్ టెలీకమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీ-2024 ఈవెంట్ ఈ ఏడాది ఢిల్లీలో అట్టహాసంగా మొదలైంది. ఈ ఈవెంట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లను పరిశీలించారు. దేశీయ ఆవిష్కరణలు ప్రదర్శించేందుకు నిర్వహించే ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ ఈవెంట్ 8వ ఎడిషన్‌ను కూడా ఈ కార్యక్రమంలోనే నిర్వహించారు. ఈ సందర్భంగా డేటా సెంటర్ల గురించి రిలయన్స్ జియో ఛైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రస్తావించారు. 'ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లను భారత్‌లో నెలకొల్పే సామర్థ్యం ఉన్నందున అవి దేశంలోనే ఉండాలని ఆకాశ్ అన్నారు. డేటా సెంటర్ పాలసీ 2020 ముసాయిదాను నవీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో భారత్‌లోని డేటా మొత్తం ఇక్కడి డేటా సెంటర్‌లోనే ఉంటుందన్నారు. భారత్ ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆకాశ్ అంబానీ అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఇలా ప్రతి రంగంలోనూ ముందుకెళ్లేందుకు ఏఐ ఓ విప్లవాత్మక సాధనమని పేర్కొన్నారు. అందుకే ఏఐ, మెషిన్ లెర్నింగ్ డేటా సెంటర్‌లు ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్న కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. మొదటిసారి భారత్‌లో జరుగుతున్న డబ్ల్యూటీఎస్ఏ కార్యక్రమంలో పాల్గొనేందుకు 190 దేశాల నుంచి 3,000 మంది పారిశ్రామిక, సాంకేతికత నిపుణులు హాజరయ్యారు. 'ది ఫ్యూచర్ ఈ నౌ' థీమ్‌తో నిర్వహిస్తున్న ఈవెంట్‌లో 120కి పైగా దేశాల నుంచి 400కు పైగా ఎగ్జిబిషన్లు, 900కు పైగా స్టార్టప్‌లు ప్రదర్శించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి సింధియా దేశీయ టెలికాం గురించి మాట్లాడారు. భారత్‌లో టెలికాం అనేది కేవలం వినోద మాధ్యమం కాదని బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కీలకమైన సమాచారం, గ్లోబల్ కమ్యూనిటీతో కనెక్ట్ అయ్యే సదుపాయాల కోసం వేగంగా విస్తరించిందన్నారు. 5జీ నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తోందన్నారు. స్పామ్ కాల్స్ పెరుగుతున్న తరుణంలో వీటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రముఖ వ్యాపారవేత్త కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు.

## డీఎస్సీ కౌన్సిలింగ్ యధాతథం

### హాజరు కావాలంటూ అభ్యర్థులకు సమాచారం



**హైదరాబాద్,నేటిధాత్రి:**
డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టింగ్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు మంగళవారం ఉదయం విద్యాశాఖ ప్రకటించినప్పటిక ఈసాంకేతిక సమస్య పరిష్కారం కావడంతో వెంటనే మళ్లీ కౌన్సిలింగ్ ప్రారంభించింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విద్యాశాఖ కీలక ప్రకటన చేసింది. డీఎస్సీ కౌన్సెలింగ్‌ను మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక సమస్యలను అధికారులు పరిష్కరించారు. దీంతో కౌన్సెలింగ్‌కు వచ్చి వెనుదిరిగిన వారికి ఆయా జిల్లాల డీఈవోలు కౌన్సెలింగ్‌కు రావాలని మళ్లీ సమాచారం ఇచ్చారు.
డీఎస్సీ 2024 ద్వారా ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకున్న కొత్త టీచర్లకు మంగళవారం పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. నూతన టీచర్లు ఆయా డీఈఓలు సూచించిన కార్యాలయాల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. అయితే సాంకేతిక కారణాలతో కౌన్సెలింగ్ వాయిదా పడింది. కాగా, కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కానీ సమస్య పరిష్కారం కావడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

## రాడార్ కేందరం ఏర్పాటుపై రాజకీయమా

### కేటీఆర్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**హైదరాబాద్,నేటిధాత్రి:**
తెలంగాణకు గర్వకారణమైన రాడార్ ప్రాజెక్టుపై భారాస, కేసీఆర్ కుటుంబం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మండిపడ్డారు. భారాస అధికారంలో ఉన్నప్పుడే దీనికి సంబంధించిన జీవోలు ఇచ్చారని గుర్తు చేశారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక మాట మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేవీ రాడార్ స్టేషన్‌కు సహకరించాల్సింది పోయి వ్యతిరేకంగా పోరాటం చేస్తామంటున్నారని విమర్శించారు. దేశ భద్రత, సమగ్రతకు వ్యతిరేకంగా పోరాటం చేస్తారా..? అని నిలదీశారు. రక్షణ శాఖకు సంబంధించిన షిప్స్‌ను కమ్యూనికేట్ చేసే రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణకు ఎంతో పేరు వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు జిల్లా అటవీ శాఖ నుంచి కేంద్ర పర్యావరణ శాఖ వరకూ అన్ని అనుమతులు పొందిందని చెప్పారు.

## లండన్‌లో తొలిసారి అలయ్‌బలయ్



**హైదరాబాద్,నేటిధాత్రి:**
హైదరాబాద్ తర్వాత ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా పరాయి గడ్డపై అలాయి బలాయి సాంస్కృతికి నాంది పలికారు. ప్రతి దేశంలో ఇప్పుడు ఎన్నో కుల సంఘాలు మత సంఘాలు రాష్ట్ర సంఘాలు, జిల్లా సంఘాలు ఇలా తెలుగు వారందరూ ఏదో ఒక సంస్థ ద్వారా సంఘాల ద్వారా విడిపోయి ఉన్నారు అందరిని కులాలకు మతాలకు అతీతంగా అందరిని ఒక వేదికపై తీసుకువచ్చి తెలుగు మాట్లాడే ప్రతి ఒక్కరు అన్నదమ్ములు వాళ్ళు కలిసి ఉండాలని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఈ సందర్భంగా సీక్క చంద్ర శేకర్ గారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి యూకే నలుముల నుండి వచ్చిన మిత్రులు వివిధ రాజకీయ పార్టీలకు, సంస్థలకు చెందిన ప్రముఖులు మరియు డాక్టర్స్ ,ఇంజనీర్స్ వివిధ వ్యాపారాలకు సంబంధించిన వ్యాపారవేత్తలు అందరూ ఈ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమని ,ఈ యొక్క ఆలయబలై ప్రతి సంవత్సరం ఇంకా అంగరంగ వైభవంగా చేసుకోవాలని కొనియాడారు. వివిధ తెలంగాణ రుచికరమైన వంటలు ఈ కార్యక్రమం లో ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి. మొదటి గా అలయ్ బలై కండువా కప్పి ప్రారంభించడం జరిగింది, యూకె లో 20 సంవత్సరాల ఆయన సందర్భంగా కూడా ఒక మంచి తటస్థ వేదిక నాంది పలకడం కూడా ఎంతో ఆనంద దాయకం అన్ని అలై బలై సభ్యులు కొనియాడారు.. ఎన్నో సంవత్సరాలుగా ఉంటూ కూడా ఎంతో మంది మిత్రులను కలిసిన సందర్భాలు తక్కువ , దశాబ్ కిందటి మిత్రులను కూడా ఈ వేదిక ద్వారా కలుసుకోవడం అలాగే ఎటువంటి జెండా, అజెండా ఈ కార్యక్రమానికి లేదని ఇది కేవలం స్నేహపూర్వక కలయికనే మరియు జమ్మి ఆకు ఇచ్చి పుచ్చుకొని అందరూ అలైబలే చెప్పుకొని తారతమ్యాలను మరచి ఎంతో ఆనందంగా ఈ కార్యక్రమం చేసుకున్నారని ఈ సందర్భంగా సభ్యులు అతిధులు కొనియాడారు.

## రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు



**హైదరాబాద్,నేటిధాత్రి:**
రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం సచివాలయంలో డీజీపీ జితేందర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదనల పై చర్చించారు. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదలు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగిన ఘటనల నేపథ్యంలో అగ్నిమాపక శాఖకు చెందిన 10 బృందాలు, తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌లోని 10 కంపెనీలను వినియోగించి తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సుమారు 2000 మందితో కూడిన బలమైన బలగాలను ఏర్పాటు చేసెందుకు, అవసరమైన బ్జడెట్ కూడా గౌరవ ముఖ్యమంత్రి గారు మంజూరు చేశారని సి.ఎస్. తెలిపారు. వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండేందుకు సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్నారు. వచ్చేనెల మొదటి వారం నుంచి సిబ్బందికి మొదటి బ్యాచ్ శిక్షణను ప్రారంభించాలని ఆమె తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్‌లకు అవసరమైన వాహనాలు, రెస్క్యూ పరికరాలు, వ్యక్తిగత రక్షణ పరికరాలు, ఇతర సాధనాల సేకరణ గురించి కూడా సమావేశంలో చర్చించారు. అవసరమైన పరికరాలు, శిక్షణ అందించడం ద్వారా అగ్నిమాపక శాఖలోని 10 బృందాలను ఎస్‌డిఆర్ఎఫ్ స్టేషన్‌లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు డిజ్ఞ÷ర్ సర్వీసెస్ నాగి రెడ్డి తెలిపారు. అదేవిధంగా ÷ుఉ÷ూఖ బెటాలియన్‌ల నుండి మొత్తం 1000 మంది సిబ్బంది (ఒక్కో సంస్థ 100 మంది సిబ్బందితో కూడినది) అగ్నిమాపక శాఖ సిబ్బందితో సమానంగా శిక్షణ పొందుతారు. ఈ బృందాలను అత్యవసర పరిస్థితిలో సంబంధిత ప్రదేశాలలో అందుబాటులో ఉంచబడతారు. శిక్షణ కోసం ఎన్‌డిఆర్ఎఫ్ సేవలను వినియోగించుకుంటామని ఆయన తెలిపారు.

## 18న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో బాబు సమావేశం



**అమరావతి,నేటిధాత్రి:**
తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ కానున్నారు. ఈనెల 18న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం కానున్న సీఎం.. పార్టీ బలోపేతం, సభ్యత్వం, ప్రభుత్వ విధానాలపై చర్చించనున్నారు. మద్యం, ఇసుక వ్యవహారాలలో ఎమ్మెల్యేల జోక్యం చేసుకోవడంపై కూడా ముఖ్యమంత్రి సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం.అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీపరంగా ఎమ్మెల్యేలతో తొలిసారిగా చంద్రబాబు భేటీ అవుతున్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికలపై కూడా ఎమ్మెల్యేలకు దిశానిర్దేశర చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ క్రమంలో సమావేశానికి సంబంధించి ఎజెండాను పార్టీ కేంద్ర కార్యాలయం తయారు చేస్తోంది. కొంతమంది ఎమ్మెల్యేలు నియోజకవర్గాలలో చేస్తున్న దందాలపై కూడా సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇవ్వనున్న ట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాలను దక్కించుకునేం దుకు... దరఖాస్తుల దాఖలు దశలోనే పలువురు ఎమ్మెల్యేలు జోక్యం చేసుకున్న సంగతి తెలిసిందే. మద్యం దుకాణాల కోసం లక్ష దరఖాస్తులు వస్తాయని, తద్వారా రూ.2 వేల కోట్ల ఆదాయం సమకూరు తుందని మొదట అంచనా వేశారు. కానీ మితిమీరిన రాజకీయ జోక్యంతో మొదట్లో చాలా స్వల్ప సంఖ్యలో దరఖాస్తులు అందాయి. దీనిపై ఎక్సైజ్ శాఖలోనూ ఆందోళన వ్యక్తమైంది. జిల్లాల వారీగా జరుగుతున్న దందాలు, నాయకులు ఎలా జోక్యం చేసుకుంటున్న తీరును సూటిగానే వివరించింది. దీనిపై సీఎం కార్యాలయం తీవ్రంగా స్పందించింది. క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించుకుని, దరఖాస్తులను అడ్డుకుంటున్న వారికి వ్యక్తిగతంగా ఫోన్లు చేసి గట్టిగా హెచ్చరించింది. నేరుగా సీఎం కార్యాలయం నుంచి హెచ్చరికలు రావడంతో ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గారు. మరోవైపు ఎక్సైజ్ శాఖ కూడా దరఖాస్తుదారులకు ఆన్‌లైన్‌లో ఎక్కువ వెసులుబాటు కల్పించింది. సమాచారం కోసం ఎక్సైజ్ ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేకుండా మొత్తం వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టింది. దీంతో దరఖాస్తుల సంఖ్య క్రమక్రమం పెరిగింది. మరోవైపు కొత్త మద్యం షాపుల వ్యవహారంలో తలదూర్చవద్దని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు ఇదివరకే హెచ్చరించారు. ప్రభుత్వం పారదర్శకంగా కొత్త షాపులను ఏర్పాటు చేస్తోంది. వాటికి ఎవరైనా దరఖాస్తు చేయవచ్చు. వారిని నియంత్రించడానికి, ఒత్తిడి తేవడానికి ఏ ఎమ్మెల్యే ప్రయత్నించినా ఊరుకొనేది లేదు. వ్యాపారాలు చేసుకొనే హక్కు అందరికీ ఉంది. ఎవరూ అడ్డుకోవద్దు. రాజకీయ పరిపాలన అంటే ప్రతిదానిలో తలదూర్చడం కాదు. ప్రజలకు మంచిచేసే పాలన. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే ప్రయత్నం చేయవద్దని ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## ఏపీలో మద్యం పాలసీ ఖరారు



**అమరావతి,నేటిధాత్రి:**
ఏపీలో నూతన మద్యం పాలసీ తేదీ ఖరారైంది. ఈనెల 16 నుంచి అంటే గురువారం నుంచే రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అమలులోకి రానుంది. ప్రతి మద్యం దుకాణంలోనూ డిజిటల్ పేమెంట్స్ జరిగేలా నిర్ణయం తీసుకుంది సర్కార్. గత ప్రభుత్వ హయాంలో డిజిటల్ పేమెంట్లకు గండిపడగా.. కూటమి ప్రభుత్వం మాత్రం డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి తీసుకుని వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి డిజిటర్ పేమెంట్లు గణనీయంగా పెరిగాయి. జూన్ నుంచి ప్రతినెలా 9 శాతం పెరిగాయి. డిజిటల్ పేమెంట్ పద్ధతిని అవలంభించడం ద్వారా మద్యం అమ్మకాల్లో పారదర్శకత పెరిగింది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీ మొత్తంలో ఆదాయం లభించనుంది. రాష్ట్ర పరిపాలనకు ఆ నిధులు ఉపయోగపడనున్నాయి. ఇకపై రాష్ట్ర వ్యప్తంగా అన్ని లిక్కర్ షాపుల్లోనూ నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేయనుంది ప్రభుత్వం. అన్ని షాపుల్లోనూ ప్రీమియం బ్రాండ్స్ అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు మద్యం టెండర్ల పక్రియ పారదర్శకంగా జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ప్రతి మద్యం దుకాణంలోనూ ఆన్‌లైన్ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చాయి. లాటరీ పక్రియ విజయవంతం అయ్యింది. అలాగే టెండర్ల కోసం విదేశాల నుంచి దరఖాస్తులు పోటెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా 3396 మద్యం దుకాణాలకు గాను 89882 దరఖాస్తులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో నూతన మద్యం పాలసీ అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఏపీలోని 3,396 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించగా.. రికార్డుస్థాయిలో 89,882 అప్లికేషన్లు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఒక్కో
షాపునకు సగటున 25 మంది దరఖాస్తు చేశారని మంత్రి కొల్లు వెల్లడించారు. దీని ద్వారా ఏపీ ప్రభుత్వానికి రూ.1,798 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. సోమవారం లాటరీ నిర్వహించి మద్యం షాపులు కేటాయింటినట్లు మంత్రి చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఈనెల 16 నుంచి నూతన మద్యం పాలసీ ద్వారా విక్రయాలు జరగనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ, మద్యం షాపుల కేటాయింపు సజావుగా జరిగింది. ఇకపై ఏపీలో మద్యం విక్రయాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే లిక్కర్ అమ్మకాలు జరుగుతాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. కొత్త బ్రాండ్స్‌ను టెండర్ కమిటీ ద్వారా ఫైనల్ చేసి తీసుకుంటాం. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. వైసీపీ హయాంలో ఇసుక, మద్యం విచ్చలవిడిగా అమ్మి జగన్ సొమ్ము చేసుకున్నారు. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ నిబంధనలు పాటించకుండా ఇసుక తవ్వకాలు చేయడం వల్ల అనేక కేసులు నమోదు అయ్యాయి. అసలు జగన్ సర్కార్‌లో ఎంత ఇసుక తీశారో, ఎంత మేర విక్రయాలు జరిగాయో లెక్కలే లేవు. వైసీపీ చేసిన ఇలాంటి పనుల వల్ల ప్రజలపై భారం పడింది. తాజాగా ఏపీలో108 ఇసుక రీచ్‌లు గుర్తించాం. ఈనెల 16న 40 రీచ్‌లను ఓపెన్ చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాం. రాబోయే రెండు నెలల్లోపే ఉచిత ఇసుక అందుబాటులోకి వస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

## అత్తా కోడళ్లపై సామూహిక అత్యాచారం కేసు



**అమరావతి,నేటిధాత్రి:**
సత్యసాయి జిల్లాలో అత్తా కోడళ్ళపై అత్యాచారం చేసిన ఘటనలో 48 గంటల్లో నిందితులను పోలీసులు పట్టుకున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. పోలీసులు సమర్థంగా పనిచేసి నిందితులను పట్టుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ ఘటనలో నిందితులకు వేగంగా శిక్ష పడాలని ఆదేశాలు జారీ చేశారని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ దీనిపై విచారణ కోసం కేసును ప్రత్యేక కోర్టుకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిఘా పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, ఇందులో ప్రజల. భాగస్వామ్యం కూడా కోరుతున్నా మన్నారు. తమ ఇళ్ల వద్ద, వ్యాపార వాణిజ్యం సముదాయాల వద్ద పెట్టుకున్న సీసీ కెమెరాలను పోలీసు శాఖకు అనుసంధానం చేస్తే నేర నియంత్రణ సాధ్యం అవుతుందన్నారు. పోలీసులకు ఆయుధాల్లాగే ప్రజలకు మొబైల్ ఫోన్‌లు కూడా ఉన్నాయని, వాటిని వినియోగించి నేర నియంత్రణకు సహకరించాలని హోంమంత్రి అనిత కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అందుకే సత్యసాయి జిల్లాలో జరిగిన అత్యాచార ఘటనలో అత్యంత వేగంగా విచారణ కోసం దొరికిన 5 గురు నిందితుల్లో ఒకరిపై 37 కేసులు ఉన్నాయని, అతనిపై అత్యాచార ఆరోపణలు కూడా ఉన్నాయని, అందుకే త్వరితగతిన విచారణకు ప్రత్యేక కోర్టుకు అప్పగిస్తున్నామని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. సత్యసాయి జిల్లాలో ఈనెల 12 వతారీఖున అత్తాకోడళ్లు సామూహిక అత్యాచారానికి గురయ్యారని.. సంఘటన జరిగిన 48 గంటల్లోనే పోలీసులు నిందితులను పట్టుకొని రిమాండు విధించారని హోంమంత్రి అనిత తెలిపారు. మహిళల భద్రత విషయంలో ఈ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, ఆడపిల్లపై నేరం చేయాలనే ఆలోచన వస్తేనే భయం వేసే పరిస్థితి తేవాలని సీఎం చంద్రబాబు సమీక్షలు నిర్వహించారన్నారు. సీసీ కెమెరాలు బద్దలు కొట్టినా వారిని రెండు వందల కిలోమీటర్లు చేజ్ చేసి కొండలు గుట్టల్లో కూడా వెతికి 48 గంటల్లో పట్టుకున్నారని చెప్పారు. వారంతా నేరచరిత్ర కలిగిన వ్యక్తులని.. నిందితుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నారని.. వారిలో ఉన్నవారిపైనా చాలా కేసులు ఉన్నాయన్నారు.
పునసరిగా శిక్షపడుతుందనే ఆలోచన వస్తేనే ఇలాంటి కేసులు తగ్గుతాయని హోంమంత్రి అనిత అభిప్రాయపడ్డారు. ఇలాంటి కేసులు వస్తే వాటిని స్పెషల్ కోర్టులకు పంపుతామన్నారు. గత ప్రభుత్వంలో ఒక రిక్రూట్‌మెంట్ ఒక్కటి కూడా జరగలేదని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే కానిస్టేబుల్ రిక్రూట్ మెంట్ చేస్తున్నామన్నారు. దసరా సమయంలో, ఆ తరువాత భవానీల రాక విషయంలోనూ పోలీసులు గొప్పగా పనిచేశారని హోంమంత్రి అనిత కొనియాడారు.

## జిల్లాకు భారీ వర్ష సూచన



**అనంతపురం,నేటిధాత్రి:**
భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 16, 17 తేదీలలో అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. వాతావరణం బాగుంటే సెలవులను రద్దు చేస్తామన్నారు. కలెక్టరేట్‌లోను, అన్నిమండల కేంద్రాలలోను ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈనెల16, 17 తేదీలలో ప్లలెపండుగ కార్యక్రమాల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుకొని వాయిదా వేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రమాదకరం గా ఉన్న బ్రిడ్జిలు, భవనాలను గుర్తించాలని అక్కడకు ఎవరిని వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టుప్రాంతాలను గుర్తించి ఎక్కడా జనం ఇబ్బందులు పడకుండా, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ ట్యాంకులను తహసీల్దార్, మైనర్ ఇరిగేషన్‌శాఖ అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఆట్యాంకుల వద్ద వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను పర్యవేక్షణకు నియమించాలని ఆదేశించారు. వర్షాల గురించి ముందుగానే గ్రామాలలో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వ్యవసాయశాఖ జేడీ ఉమా మహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, ఎల్‌డీఎం నర్సింగరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.బీ.దేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# మహారాష్ట్ర, జార్ఖండ్‌లో మోగిన ఎన్నికల నగారా

**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్ జరుపనున్నట్టు సీఈసీ రాజీవ్ కుమార్ ప్రకటించారు. నవంబర్ 23న ఫలితాలు ప్రకటిస్తారు. గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 22న వెలువడుతుంది. నామినేషన్ల గడువు అక్టోబర్ 29వ తేదీతో ముగుస్తుంది. నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 30న జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు నవంబర్ 4వ తేదీతో ముగుస్తుంది. నవంబర్ 25వ తేదీలోగా ఎన్నికలు ముగియాల్సి ఉంటుంది. జార్ఖాడ్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతలుగా జరుగనున్నట్టు సీఈసీ ప్రకటించారు. తొలి విడత నవంబర్ 13, రెండో విడత నవంబర్ 20న జరుగుతుంది. తొలి విడత ఎన్నికలకు అక్టోబర్ 18న నోటిఫికేషన్ వెలువడుతుంది. అక్టోబర్ 25తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. అక్టోబర్ 28న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 30తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. తొలి విడతలో భాగంగా 43 నియోజకవర్గాలకు నవంబర్ 13న పోలింగ్ జరుగుతుంది. రెండో విడత నోటిఫికేషన్ అక్టోబర్ 22న వెలువడుతుంది. అక్టోబర్ 29తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. అక్టోబర్ 30న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు నవంబర్ 1వ తేదీతో ముగుస్తుంది. నవంబర్ 20న రెండో విడత పోలింగ్ జరుగుతుంది. నవంబర్ 23న కౌంటింగ్ జరిపి ఫలితాలు ప్రకటిస్తారు. కాగా, 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26తో ముగుస్తోంది. ఈలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. 81 స్థానాలున్న జార్ఖాండ్ అసెంబ్లీ గడువు వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో ముగుస్తుంది. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన, ఎన్‌సీపీతో కూడిన మహాకూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా, జార్ఖాండ్‌లో జెఎంఎం అధికారంలో ఉంది. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని 9 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల తేదీని కూడా ఎన్నికల కమిషన్ మంగళవారంనాడు ప్రకటించింది. నవంబర్ 13న పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు ప్రకటిస్తారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కూడా ఇదే రోజు ప్రకటిస్తారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో ఉప ఎన్నికలు జరగనున్న 9 అసెంబ్లీ స్థానాల్లో మీరాపూర్, కుందర్కి, ఘజియాబాద్, ఖైర్, కర్హాల్, సిషామౌ, ఫూల్పూర్, కతెహారి, మజవాన్ ఉన్నాయి. వీటిలో నాలుగు స్థానాలను సమాజ్‌వాదీ పార్టీ గెలుచుకోగా, బీజేపీ 3, రాష్ట్రీయ లోక్‌దళ, నిషద్ పార్టీ చెరో స్థానం గెలుచుకున్నాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన ఆయా పార్టీల నేతలు తాము గెలిచిన అసెంబ్లీ స్థానాలను వదులుకోవడంతో యూపీలోని 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి యూపీలో ఎదురుదెబ్బ తగలడంతో ఈ అసెంబ్లీ ఉప ఎన్నికలు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు గట్టి సవాలనే చెప్పాలి.

# సమిష్టి నిర్ణయాలకు మోడీ పాతర



**నేటిధాత్రి డెస్క్:**
మరోమారు పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. మొన్నటి హర్యానా, కాశ్మీర్ ఎన్నికల్లో మాత్రం బిజెపి హర్యానాలో అధికారం నిలబెట్టుకుంది. ఇప్పుడు మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు రాబోతున్నాయి. త్వరలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగనున్నాయి. ఇదే క్రమంలో జమిలి ఎన్నికలపై ప్రధాని మోడీ పట్టుదలగా ఉన్నారు. ఇలా వరుస ఎన్నికలు నిజంగానే దేశానికి మంచిది కాదు. దేశ ఆర్థిక వ్యవస్థపై ఇవి తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వరుస ఎన్నికలు కేవలం రాజకీయ పార్టీలకు లబ్ది చేకూరుస్తున్నాయే తప్ప ప్రజలకు కాదు. దీనిపై ఆలోచన చేసి త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిందే. ఇకపోతే ప్రధాన నిర్ణయాలన్నీ ఏకపక్షంగా తీసుకోవడం సరికాదు. మిత్రపక్షాలతో పాటు, అఖిలపక్షంలో కూడా చర్చించి నిర్ణయాలు తీసుకుంటే మంచిది. ఇలా ఓ మంచి సంప్రదాయానికి మోడీ శ్రీకారం చుట్టాలి. విపక్షాల అభిప్రాయాలు కూడా స్వీకరించాలి. దేశ ఆర్థికపరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. ధరలు విపరీతంగా పెరుగుతు న్నాయి. ప్రజలు బతకలేని దుర్భర పరిస్థితులు తరుముకు వస్తున్నాయి. అయినా పట్టించుకోవడం లేదు. జిఎస్టీ వసూళ్లు పెరగడం ఘనతగా చాటుకుంటున్నారు. ఇకపోతే ప్రధానిగా మోడీ నిర్ణయాలు తీసుకుంటు న్నారే తప్ప వాటి పర్యవసానాలను పరిశీలించడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వాటిని పట్టించు కోకుండా ఆర్థిక సంస్కరణల పేరుతో బురిడీ కొట్టిస్తున్నారు. ఇలాంటి సమస్యలపై ఆర్థిక నిపుణులు, విపక్షాలతో చర్చించాలి. దేశం కోసం సమిష్టి నిర్ణయాలు తీసుకుంటే మంచింది. త్వరలోనే మరిన్ని ఎన్ని కలు రాబోతున్నాయి. ఈ క్రమంలో ప్రజలను బోల్తా కొట్టించే మాటలు తప్ప పటిష్టమైన అభివృద్ధి చర్యలు కానరావడం లేదు. పదేపదే కాంగ్రెస్‌ను ఇంకా విమర్శించడం ద్వారా మోడీ తన అసమర్థతను బయట పెట్టుకుంటున్నారు. జిఎస్టీ వాతలు వద్దు బాబోయ్ అంటున్నా మోడీ చెవికెక్కడం లేదు. జిఎస్టీ సామాన్యుల కు మరణశాసనంగా మారింది. దేశంలో పరిస్థితులు ఇలాగే కొనసాగితే సామాన్యులు బతికి బట్టకట్టడం దుర్లభంగా మారనుంది. పెరుగుతున్న ధరలకు తోడు జిఎస్టీ భారాం అంతాఇంతా కాదు. బిజెపిని ప్రజలు నమ్మనంతగా ఇప్పుడు దేశంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. వ్యక్తిగతంగా నష్టపోయే ప్రమాదేమీ మోడీకి లేకపోవచ్చు. ఆయన పదేళ్ల కాలంలో కార్పోరేట్ కంపెనీలు మరింత బలపడుతున్నాయి. పదేళ్ల క్రితం బిజెపి వస్తే సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్న దశలో ..బిజెపి అధికారంలోకి వచ్చినా సమస్యలు మాత్రం మరింతగా చుట్టుముట్టాయి. పదేళ్ల క్రితం అన్ని వస్తువుల ధరలు పోల్చి చూస్తే మనం ఎంతగా పెరిగాయో అర్థం చేసుకోవచ్చు. ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకుండా పోతోంది. ఇకపోతే బలముందన్న ధోరణిలో మోడీ కూడా మిత్రపక్షాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. మొన్నటి ఎన్నికల్లో కొద్దిమేర ప్రజలు హెచ్చరికలు చేసినా..మోడీ తిరిగి ప్రధాని కావడంతో పాతపద్ధతిలోనే ముందుకు సాగుతున్నారు. విపక్షాల వారికి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. సమస్యలపై చర్చించడం లేదు. కనీసంగా ఎన్‌డిఎ పక్షాలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవడం లేదు. పూర్తిస్థాయి మెజార్టీ ఉండడం వల్ల నడుచుకున్న తీరుగానే ఇప్పుడు తన పాలనా ధోరణిని కొనసాగిస్తున్నారు. సొంత పార్టీలోనూ మోడీని ఎదరించేవారు లేకపోవడంతో ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.అయితే తనకు తిరుగు లేదన్న ధోరణి ప్రవర్తిస్తే ప్రజలు తమకు అవకాశం వచ్చిన సమయంలో తడాఖా చూపుతారు. అప్పుడు నష్టపోయేది మాత్రం బిజెపియే. రానున్న ఎన్నికల్లో తాయిలాలు ప్రకటించే బదులు ప్రజలు ఏ రకంగా ఇబ్బందులు పడుతున్నారో గుర్తించి నిర్ణయాలు తీసుకుంటే మంచింది. లేకుంటే నడిస్తే నష్టపోయేది బిజెపి మాత్రమే. నియంతృత్వ పోకడలు విడనాడ కుంటే వాజ్‌పేయి, అద్వానీ లాంటి అతిరథ మహారథులు తీర్చిదిద్దిన బిజెపికి ఇక భారతదేశ చరిత్రలో రాజకీయ స్థానం ఉండకపోవచ్చు. అంతిమంగా బిజెపిని నమ్మడం అన్నది ఇక భ్రమ కాగలదు. ఇక దిక్కు లేక మళ్లీ ప్రజలు కాంగ్రెస్‌నో లేదా ఇతర మిత్రపక్షాల కూటమికో అధికారం అప్పగిస్తారు. పప్పుముద్దగా రాహుల్‌ను అభివర్ణించినా...భారత్ జోడో యాత్రతో ప్రజల్లో కదలిక తెచ్చారు. అనూహ్యంగా ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్‌ను తీసుకుని రాగలిగారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కూర్చున్నారు. ఈ ప్రమాదాలను బిజెపి ద్వయం గుర్తించడం లేదు. ఇంకా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ పోవడం కన్నా ప్రజలను గుర్తించి, వారి సమస్యలను ఆకళింపు చేసుకుని పనిచేయడం నేర్చుకోవాలి. ఇకపోతే ఇప్పుడు మోడీని వ్యతిరేకించే పార్టీల్లో ఐక్యత వస్తోంది. ఇది కాంగ్రెస్‌కు వరం కానుంది. వాజపేయి హయాంలో ఎన్డీఏ నిర్మాణం జరిగినా అప్పుడు రాష్ట్రాల నేతలకు విలువ ఉండేది. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాధి నేతలకు ప్రాధాన్యం దక్కడం లేదు. చంద్రబాబుకు కొద్దో గొప్పో అవకాశం ఇప్పుడు వస్తోంది. గతంలో ఇలాంటి అవకాశం ఎలాగూ లేదు. కూటమినుంచి పార్టీలు తప్పుకుంటే బీజేపీ ఏకాకి కాక తప్పదు. కూలి పోవడానికి కూడా సమయం పట్టదు. అయితే బిజెపిలో నిర్ణయాలు తీసుకుంటున్న మోడీ, అమిత్‌షాలు దీనిని గుర్తించి పాలనా వ్యవహారాల్లో మార్పులకు సిద్దపడాలి.ప్రధాని మోదీ అనుసరిస్తున్న నిరంకుశ నిర్లక్ష్య వైఖరి నుంచి బయటపడాలి. ఎన్‌డిఎ పక్షాలకు విలువ ఇవ్వడం నేర్చుకోవాలి. మోదీ వైఖరి అంటే ఇష్టపడని ఎంపీలు, మంత్రులు బీజేపీలో ఉన్నప్పటికీ వారు ప్రభుత్వాన్ని పడగొట్టుకోవాలని అనుకోవడం లేదు. బీజేపీ సంకీర్ణధర్మాన్ని పాటించి, సమిష్టి నిర్ణయాలకు పెద్దపీట వేయాలి. ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న జిఎస్టీ, ధరల వంటి సమస్యలను ఎన్‌డిఎ పక్షాలతో చర్చించాలి. అప్పుడే ప్రజలకు మేలు జరగగలదు.

# ఐఏఎస్‌లకు చుక్కెదురు..

## డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులకు క్యాట్ నో..!



**హైదరాబాద్,నేటిధాత్రి:**
తెలంగాణ కేడర్ నుంచి ఏపీకి కేటాయించిన ఐఏఎస్ అధికారులకు చుక్కెదురైంది. పలువురు ఐఏఎస్ అధికారులను ఏపీకి కేటాయిస్తూ డీవోపీటీ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ ఐఏఎస్‌లు ఆమ్రపాలి, వాణిప్రసాద్, వాకాటి కరుణ, సృజన కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు ఐఏఎస్ అధికారుల పిటిషన్లపై మంగళవారం క్యాట్ విచారణ జరిపింది. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. ఐఏఎస్ అధికారుల తరఫున వాదనలు వినిపించిన న్యాయవాదులు క్యాట్ ఎదుట వాదనలు వినిపించారు. డీవోపీటీ ఉత్తర్వులు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ నెల 16న డీవోపీటీ రిలీవ్ కావాలని డీవోపీటీ ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఐఏఎస్‌ల అభ్యర్థనలను డీవోపీటీ పరిశీలించాల్సి ఉందని.. డీవోపీటీ నేరుగా నిర్ణయం తీసుకోకుండా వన్‌మెన్ కమిటీని నియమించిందని తెలిపారు.

ఐఏఎస్‌ల కేటాయింపు నిర్ణయాధికారం డీవోపీటీకే ఉందని న్యాయవాదులు క్యాట్‌కు తెలిపారు. వన్‌మెన్ కమిటీ సిఫారసును డీవోపీటీ ఎలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. డీవోపీటీ వన్‌మెన్ కమిటీ ఇచ్చిన నివేదికను ఐఏఎస్‌లకు ఇవ్వలేదని.. ఐదుగురు ఐఏఎస్‌లకు కమిటీ నివేదికను చూపలేదన్నారు. కమిటీ నివేదిక ఇవ్వకుండానే డీవోపీటీ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. క్యాట్ స్పందిస్తూ.. వరదలతో ఏపీ ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని.. వరద ప్రాంతాలకు వెళ్లి సేవ చేయాలని లేదా? అని ప్రశ్నించింది. వన్‌మెన్ కమిటీని డీవోపీటీ వేసినప్పుడు ఎందుకు స్పందించలేని.. అసలు నివాసానికి అర్థం ఏంటో చెప్పాలని.. కోర్టు ధిక్కరణ పిటిషన్ ఎందుకు దాఖలు చేయలేదంటూ ప్రశ్నిస్తూ.. ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. బుధవారం యథావిధిగా ఐఏఎస్ అధికారులంతా రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. డీవోపీటీ ఆదేశాలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది.

అలాగే, వన్‌మెన్ కమిటీ రిపోర్టును సమర్పించాలని సూచించింది. విచారణను నవంబర్‌కు వాయిదా వేసింది. క్యాట్ ఉత్తర్వుల నేపథ్యంలో తెలంగాణ నుంచి రిలీవ్ కానున్న అధికారుల జాబితాలో ఆమ్రపాలి కాట, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణిప్రసాద్, సృజన, హరికిరణ్, శివశంకర్ ఉన్నారు. క్యాట్‌లో ఊరట దక్కకపోవడంతో అధికారులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. డీవోపీటీ ఉత్తర్వులపై హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఇదిలా ఉండగా.. ఏపీ విభజన నేపథ్యంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కేంద్రం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కేంద్రం సర్దుబాటు చేసింది. ఈ సమయంలో ఐఏఎస్ అధికారులను ఏపీ, తెలంగాణ కేడర్‌లకు కేటాయించింది. అయితే, ఇందులో కొందరు అధికారులు తమను ఏపీ కేడర్‌కు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల అభ్యంతరాలను తిరస్కరించిన డీవోపీటీ ఇటీవల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఈ నెల 16లోగా ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

# కొయ్యూరులో డీఎస్పీ ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్



**మలహార్ రావు. నేటిధాత్రి :**
భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలంలోని కొయ్యూరులో కాటారం డిఎస్పి రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని లైసెన్సులు, నెంబర్ ప్లేట్ లేని బైకులను స్వాధీనం చేసుకొని యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. అదేవిధంగా గుడుంబా, గంజాయి, సైబర్ క్రైమై నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగార్జున రావు ఎస్సై వడ్లకొండ నరేష్, పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

# ఏపీని నిలబెట్టేలా సాయం అందాలి

**విజయవాడ,నేటిధాత్రి:**
ఎన్డీఎలో ఉంటూ ఎంతోకాలంగా బిజెపితో చెలిమిగా ఉంటున్న అనేక పార్టీల్లో ఇప్పుడు అసంతృప్తి రగులుతోంది. దేశంలో పరిస్థితులపై ఎన్డీఎ పక్షాలతో చర్చించే అవకాశం లేదు. చర్చిద్దామని అడిగే ధైర్యం ఆయా పార్టీలు చేయడం లేదు. ఈ పార్టీలన్నీ రేపు ప్రజల ముందు సంజాయిషీ ఇచ్చుకోక తప్పదు. మోడీ వ్యవహార శైలిని గట్టిగా విమర్శిస్తూ సవాల్ విసిరిన పార్టీలు అడ్రస్ లేకుండా పోయాయి. ఎపిలో టిడిపి మళ్లీ ఎన్డీయే కూటమితో జతకట్టి, కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కూటమి నుంచి బయటకు వెళితే తమకు పుట్టగతులు ఉండవన్న భయం కూడా ఆయా పార్టీల్లో ఉండివుంటుంది. బీజేపీ వైఖరిపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం అవుతున్నా బయటపడడం లేదు. కేంద్రంలో బీజేపీ మూడో పర్యాయం అధికారానికి వచ్చినప్పటి నుంచీ ఆయా పార్టీల్లో అసంతృప్తి రగులుతున్నది. నిజానికి అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్ర మోదీ తీసుకున్న గొప్ప నిర్ణయాలు ఏమీ లేవు. యూపీఏ పాలనలో చోటుచేసుకున్నాయని చెబుతున్న అవినీతి కుంభకోణాలతో ప్రజలు విసుగెత్తి ఉండటాన్ని గమనించిన మోదీ, అవినీతిపై యుద్ధం ప్రకటిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో పెద్దనోట్లను రద్దు, జీఎస్టీని అమలులోకి తెచ్చారు. ఈ రెండు నిర్ణయాలు దేశ ప్రజలను అగాథంలోకి నెట్టాయి. ఈ దశలో విభజన సమస్యలను పెడచెవిన పెట్టిన కేంద్రం తీరుపై ఎపి నేతలు రగిలిపోయారు. రాజకీయ పార్టీల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజలు మాత్రం తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నారు.

భారతీయ జనతా పార్టీ తమకు తీవ్ర అన్యాయం చేసిందని రగిలిపోతున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేయగా, ఇప్పుడు భారతీయ జనతా పార్టీ అంతకంటే దారుణంగా వ్యవహరిం చిందనీ, నమ్మించి గొంతు కోసిందని విమర్శలు వెల్లువెత్తున్నాయి. నిధుల కేటాయింపులు, నీళ్ల పంపకాల్లో తెలంగాణ ప్రభుత్వం కూడా అసంతృప్తి వ్యక్తంచేసి ఎదురుదాడి చేస్తోంది. తెలంగాణ ప్రజల కోరిక మేరకు రాష్ట్ర విభజనకు పూనుకున్న ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం, తమను దిక్కులేని వారిని చేసిందన్న ఆవేదన ఏపీ ప్రజలలో ఏర్పడింది. ఆ కారణంగానే నరేంద్ర మోదీ,చంద్రబాబు జంట అధికారంలోకి వస్తే తమకు న్యాయం జరుగుతుందని ఆశలు పెంచుకున్నారు. కానీ అడియాశలు అయ్యాయి. పదేళ్లు గడిచినా ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో కేంద్రం నుంచి రాష్ట్రానికి సహాయం అందడంలేదు. ఏపీకి ప్రత్యేక హోదా లభిస్తే పరిశ్రమలు వచ్చి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజానీకం ఆశించింది. అయితే మోదీ ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రత్యేక ప్యాకేజీ పేరుతో ఊరించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత మళ్లీ కొంత విదిల్చడం మొదలయ్యింది. అయితే పెద్దగా పనులు సాగేలా మాత్రం నిర్ణయాలు తీసుకోవడం లేదు. ఇందులో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు నాబార్డ్ ద్వారా నిధులు అందించాలన్న నిర్ణయం తీసుకున్నారు. పోలవరం, విశాఖ రైల్వే జోన్, రాజధాని వంటి అంశాలపై మళ్లీ కదలిక వస్తోంది. ఈ ఐదేళ్లలో గణనీయంగా ఆర్థిక సాయం అందితేనే ఎపికి బలం చేకూరుతుంది. అలాగే ఉబయ తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధికి అడుగులు పడాలి.

# అధికారంలోకి వచ్చాక ఊసరవెల్లిలా మారిన రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ,నేటిధాత్రి:**
పోలీస్ కానిస్టేబుల్స్‌కు జరుగుతున్న శ్రమదోపిడి గురించి నాడు అసెంబ్లీలో మాట్లాడిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక ఊసరవెల్లిలా మారి శ్రమ దోపిడి విధానాన్ని అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. టీఎస్ఎస్పీ కానిస్టేబుల్స్ 15 రోజులకు ఒకసారి బదులు.. నెలకు ఒకసారి ఇంటికి వెళ్లేలా లీవ్ మ్యానువల్ మార్చడం దుర్మార్గం అని మండిపడ్డారు. వారాల పాటు కుటుంబాలకు దూరం చేయడమేనా మీరు పోలీసులకు ఇచ్చిన దసరా, దీపావళి కానుక అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు.

హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి గారూ.. టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లకు నెలకొకసారి లీవు విధానం అమలు చేయకుండా, ప్రస్తుత విధానాన్ని కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సివిల్, ఏఆర్ ఇతర విభాగాల పోలీసులకు 15 రోజుల టీఏ ఇచ్చేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడు రోజులకు దాన్ని కుదించింది. వారి పొట్ట కొట్టకుండా పాత విధానం ప్రకారమే 15 రోజుల టీఏ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న టీఏ, ఎస్ఎల్, జీపీఎఫ్‌లను వెంటనే విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల సరెండర్ లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ పెండింగ్ డబ్బులు చెల్లించాలి. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే క్లియర్ చేయాలి. సివిల్ పోలీసులు వినియోగించే వాహనాల డీజిల్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి. కేసీఆర్ ప్రభుత్వం పోలీసు స్టేషన్ల నిర్వహణ కోసం మండల పోలీసు స్టేషన్‌కు రూ. 25 వేలు, పట్టణాల పరిధిలోని పీఎస్‌లకు రూ. 50 వేలు, హైదరాబాద్‌లో అయితే రూ. 75 వేలు ఇచ్చేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పోలీస్ స్టేషన్ నిర్వాణ కోసం నిధులు విడుదల చేయడం లేదు. దానివలన పోలీసులు, పోలీస్ స్టేషన్ వెళ్ళే ప్రజలపై భారం పడుతున్నది. ఈ నిధుల విడుదల కోసం సీఐలు ప్రభుత్వం వద్ద పైరవీలు చేసే దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కళ్లు తెరిచి పోలీస్ స్టేషన్ల నిర్వహణ కోసం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి



**హైదరాబాద్ ,నేటిధాత్రి:**
రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

గురుకుల భవనాలకు అద్దె చెల్లిస్తలేరు. కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తలేరు. కనీసం అన్నం పెట్టలేని స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారిందని కేటీఆర్ విమర్శించారు. చదువు పక్కనపెట్టి విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు రోడ్లపై ధర్నాలు చేసే దుస్థితి తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ ప్రైవేట్ కాలేజీలను నిరవధికంగా మూసివేయటంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకుండా పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూసీ కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేసే కాంగ్రెస్ సర్కార్ దగ్గర అద్దె, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వటానికి పైసలు లేవా? రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేదు, ముఖ్యమంత్రికి విద్యారంగంలో సమస్యలను తెలుసుకునే ఓపిక లేదు. రాష్ట్రంలో విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాల్సిందిపోయి.. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపించే పనిలోనే ముఖ్యమంత్రి బిజీగా ఉన్నాడు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటమాడుతోంది. ఢిల్లీకి మూటలు పంపించటంపై ఉన్న శ్రద్ధ.. విద్యార్థులకు మేలు చేయటంలో లేదా? కాలేజీలు నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించినా, సర్కారుకు చీమ కుట్టినట్లైనా లేదా? వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి. విద్యార్థులకు అన్యాయం చేస్తామంటే బీఆర్ఎస్ సహించదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్

## పలు పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

**హైదరాబాద్,నేటిధాత్రి:**
గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్‌లు దాఖలు చేశారు. మంగళవారం ఉదయం ఈ పిటిషన్లపై హైకోర్టులో విచారణకు వచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1లో తప్పుడు ప్రశ్నలను తొలగించాలని ఒక పిటిషన్ దాఖలవగా.. ప్రిలిమినరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు చేశారు. తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్ల పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. త్వరలో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే మెయిన్స్ విద్యార్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌లను కొట్టివేసింది. దీంతో ఈనెల 21 నుంచి గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరుగనున్నాయి. మరోవైపు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు ఈ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్లు పరీక్ష ప్రారంభమయ్యే ఒక రోజు ముందు వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను అనుమతించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టంచేశారు. మెయిన్స్‌లో భాగంగా ప్రతి అభ్యర్థి ఆరు పేపర్లకు సంబంధించి పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

# దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలి



**వరంగల్,నేటిధాత్రి:**
తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘం మరియు ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో దేశాయిపేటలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన స్థలాన్ని సందర్శించి అక్కడ స్థానికులను జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకోవడం జరిగింది అనంతరం పూలే నూతన విగ్రహాన్ని పోలీసులు పునర్ పునర్ ప్రతిష్ట చేయడం సంతోషాన్ని వ్యక్తం చేశారు పూల విగ్రహానికి పూలమాలలు వేసి విగ్రహాన్ని ధ్వంసం చేసినటువంటి దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని గతంలో కరీమాబాదులో దసరా సందర్భంగా ఇలానే జరిగిందని అప్పుడు ప్రభుత్వం బీసీ నాయకులను అరెస్టు చేసిన సంఘటన గుర్తు చేశారు, ఇప్పుడు బీసీ ఎస్సీ ఎస్టీ సంఘాలు నాయకులు స్పందించే లోపే పోలీసులు విగ్రహాన్ని ప్రతిష్ట చేసి ఉద్యమాన్ని నీరు చెప్పే ప్రయత్నం చేశారు అయినా మహనీయుల విగ్రహాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నటువంటి దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాలను పోలీస్ శాఖను విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్, మాజీ ఉద్యోగ సంఘాల నాయకులు దార జనార్దన్ గౌడ్ , బీసీ జాక్ వైస్ చైర్మన్ పటేల్ వనజ, అరుణ్ అక్క, తాటికొండ సద్గుణ, బీసీ నాయకులు నలుబోల రవికుమార్, అనిశెట్టి సాయి తేజ, నలుబోలా అమరేందర్, కొండి కృష్ణ గౌడ్, నలుబోలా సంజయ్, మామిడి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రవాణా శాఖలో ఎవరు రాజ్యమేలుతున్నారు

## ఏజెంట్లతో నిండిన భద్రాచలం రవాణా శాఖ కార్యాలయం

- పైసలు ఇస్తేనే పనులు..
- ఓవర్ లోడ్ అయితే నాకేంటి.
- ఇసుక మాఫియా తో మిలాఖత్..?- పట్టించుకోని ఆ శాఖ అధికారి

ప్రతినిత్యం వేలలో వసూలు అనేక ఆరోపణలతో భద్రాచలం రవాణా శాఖ కార్యాలయం. అవినీతి నిరోధక శాఖ అధికారులు దృష్టి సారించండి.




**భద్రాచలం, నేటిధాత్రి:**
భద్రాచల పట్టణంలో మోటారు వెహికల్ తనిఖీ కార్యాలయం ఉన్నది. ఆ కార్యాలయంలో ఒక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ,ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు, ఒక కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తుంటారు. కానీ అక్కడ సుమారు 20 మందికి పైగా ఏజెంట్లు కార్యాలయంలో ఉండి కార్యక్రమాలు చక్కబెడుతున్నారు. ప్రభుత్వం రవాణా శాఖలో ఏజెంట్ల వ్యవస్థను రద్దుచేసి ప్రతి ఒక్కరికి ఆన్ లైన్ సిస్టం ద్వారా అప్లికేషన్లు తీసుకొని నేరుగా అన్ని రకాల సేవలు అందించాలని పేర్కొంది. కానీ అక్కడ అవేమి పట్టవున్నట్లు ఏజెంట్ లే పెత్తనం చలాయిస్తూ, ఆ కార్యాలయ సిబ్బంది కమిషన్లు తీసుకుంటూ ప్రతినిత్యం వేలాది రూపాయలు రవాణా శాఖ పనిమీద వచ్చే వారి వద్ద దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్క అధికారిని బట్టి ఒక్కొక్క స్థాయి డబ్బులు తీసుకోవడం పరిపాటిగా మారింది. పేరుకే తనిఖీ అధికారి. కానీ ఎక్కడ తనిఖీ చేసిన పాపాన పోలేదు. విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ఓవర్ లోడ్ తో వెళ్తున్న లారీలను, ట్రాక్టర్లను ఆపి తమ కర్తవ్యాన్ని నిర్వహించాల్సిన మోటార్ వెహికల్ కార్యాలయం అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇసుక పెద్ద మొత్తంలో అక్రమంగా తరలిస్తున్నారని, వేబిల్లులు లేకుండా కొన్ని లారీలు యదేచ్ఛగా ఇసుక తోలుతున్నాయని, పరిమితికి మించి 15 టన్నులకు పైగా ఇసుక వేసుకొని తిరుగుతున్నాయని చెప్పినా, పట్టించినా ఆ అధికారి పట్టించుకోకుండా ఇసుక అక్రమ రవాణా దారులకు కొమ్ము కాస్తున్నాడని వాదనలు ఉన్నాయి. ఇంత అక్రమా రవాణా జరుగుతున్న నాకు సంబంధం లేదు అనే అధికారి చెప్పడం కొసమెరుపు.. వీరు చేయాల్సిన పని చేయకపోవడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ధనం అక్రమార్కుల చేతిలోకి వెళ్తుంది. అనేక సంవత్సరాలుగా ఈ రవాణా శాఖ అధికారి కార్యాలయం అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటుంది. పైసలు ఇవ్వనిదే పని కావట్లేదని పలువురు వాపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ అవినీతి నిరోధక శాఖ అధికారులు ఈ కార్యాలయం పై ప్రత్యేక దృష్టి సారించి లంచగొండులపై, నియమ నిబంధనలు పాటించకుండా పనిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# చీఫ్ ఇంజనీర్ కలిసిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం



**గణపురం నేటిధాత్రి:**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లో నూతనంగా చీఫ్ ఇంజనీర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన చిత్తప్రగడ శ్రీ ప్రకాష్ గారిని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం హెచ్-58 యూనియన్ జెన్ కో అధ్యక్షులు ఎలకంటి రగోత్తం గారి ఆద్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి పూల బొకే అందించి శాలువా కప్పి సన్మానించారు ఈ సందర్భంగా ఓ %ఆ% ఎం కార్మికుల పదోన్నతులు కల్పించుటకు డిపిసి కండక్ట్ ఆర్టీజన్ కార్మికులకు యూనిఫాం , రేయిన్ కోట్, సీనియరిటీ జాబితా పలు సమస్యలు వారి దృష్టి కి తీసుకెళ్ళడం జరిగింది ఈ కార్యక్రమంలో టిఆర్వికెఎస్ రాష్ట్ర నాయకులు కెటిపిపి రిజినల్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కమిటీ ముఖ్యనాయకులు సభ్యులు ఆర్టీజన్ కార్మికులు మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు నూతనంగా విచ్చేసిన చీఫ్ ఇంజనీర్ శ్రీ ప్రకాష్ మాట్లాడుతూ మీ యొక్క అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలు వివరాలు సేకరించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యే ప్రయత్నం చేయడం జరుగుతుంది అని చెప్పారు

# మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలి



**భద్రాచలం, నేటిధాత్రి:**
దిశా ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ ప్రతి మహిళ ఆత్మగౌరవంతో జీవించాలని రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం తీసుకొస్తున్న పథకాలను అందిపుచ్చుకోవాలని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు కోరారు. మల్లవరం పట్టణంలోని ఏఎంసీ కాలనీలో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మంది పేద మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ. దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జాతీయ చైర్మన్ బివి రాజు జాతీయ ఉపాధ్యక్షురాలు కళ్యాణిల ఆదేశానుసారం అనేక బహుమక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పట్టణంలో ఒంటరి మహిళలు వెనుకబడిన మహిళలకు కావలసిన ఇంద్ర మహిళలు పెన్షన్లు దిశా కమిటీ సభ్యులు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే మంజూరు చేపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మీ మాట్లాడుతూ దిశా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అనేక బహుమక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ప్రతి సంవత్సరం దసరాకి బతుకమ్మ ఉత్సవ నిర్వహించి పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో దిశా ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమం నిర్వహించేందుకు జాతీయ చైర్మన్ బివి రాజు ఉపాధ్యక్షురాలు కళ్యాణి ఇలా నేతృత్వంలో సిద్ధమవుతున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మండల అధ్యక్షురాలు స్రవంతి తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం



**పర్వతగిరి, నేటిధాత్రి:**
వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీడీవో మాలోతు శంకర్ నాయక్ పాల్గొని చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల అతి సార, శ్వాస కోశ వంటి రోగాల నుండి దూరంగా ఉండవచ్చని సూచించారు. జిల్లా స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ మలినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ స్నానం కన్నా చేతులను శుభ్రంగా ఉంచుకోవడం అతి ముఖ్యమని అన్నం తినే ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో బాగా రుద్ది శుభ్రపరచుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్ , ఎంఈఓ జి. లింగారెడ్డి పంచాయతీ కార్యదర్శి రఘు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు..

# తెలంగాణకల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

- తెలంగాణకల్లుగీత కార్మిక సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు కొండ వెంకన్న..



**నల్లగొండ జిల్లా, నేటిధాత్రి:**
బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేజీ కేఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాడి 10 సంవత్సరంలు పూర్తి చేసుకున్న సందర్భంలో కల్లుగీత కార్మిక సంఘం పదేండ్ల ప్రయాణం పేరుతో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సుకు నల్లగొండజిల్లా నుండి కల్లు గీత కార్మికులు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొండవెంకన్న పిలుపునిచ్చారు. మంగళవారం చందూరు మండల కేంద్రంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం 67 వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాడి 10 సంవత్సరంలు పూర్తి అవుతున్న ప్రభుత్వాలు మారిన కల్లు గీత కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కరించలేకపోయారనిఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కల్లు గీత కార్మికుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించకపోవడం కేటాయించిన నిధులు ఖర్చు చేయకపోవడం వల్ల గీత కార్మికుల జీవితాలలో ఎలాంటి మార్పు లేదని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది మాసాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ప్రభుత్వం కల్లు గీత కార్మికుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.వృత్తి రక్షణ కోసం. గీత కార్మికుల యువత ఉపాధి అవకాశాలు మెరుగు కోసం చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.. గీత కార్మికులందరికీ మోటర్ బైక్ లు ఇవ్వాలని. గీత కార్మికులు సహజ మరణం పొందిన ఎక్స్రేషియా వచ్చే విధంగా గీతన్న బీమా పథకాన్ని అమలు చేయాలని. ప్రతి గీత కార్మికుల కుటుంబానికి రెండు లక్షల రూపాయల సబ్సిడీ రుణం ఇవ్వాలనిఆయన అన్నారు.ఎక్స్రేషియా పదిలక్షలకు పెంచాలని 18 డిమాండ్లతో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని ఈ సదస్సుకు జిల్లా నుండి అధిక సంఖ్యలో గీత కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, కెవిపిఎస్ జిల్లా నాయకులు రవీందర్, కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు చెనగోనికిరణ్, బొమ్మరగోని కిరణ్, ఖమ్మంపాటి యాదయ్య, బొమ్మర గోని కృష్ణయ్య, బిక్షం, చేనగాని పెంటయ్య, బోయపల్లి రోశయ్య, అంజయ్య, శ్రీను, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి





**హసన్ పర్తి, నేటిధాత్రి:**
వర్ధన్నపేట నియోజక వర్గం హసన్ పర్తి మండలం అర్వపల్లి గ్రామానికి చెందిన అంబాల రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఈ విషయం తెలుసుకుని వర్ధన్నపేట నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం చేశారు. వీరి వెంట బిజెపి పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు, మల్లారెడ్డిపల్లి పిఎసిఎస్ చైర్మన్ జక్కు రమేష్ గౌడ్, 66 వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కాజీపేట దర్గా చైర్మన్ ఊకంటి వనం రెడ్డి, తాళ్లపల్లి కుమారస్వామి, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# బిజెపి పార్టీ సభ్యత్వ నమోదు పై సమీక్ష సమావేశం



**భూపాలపల్లి, నేటిధాత్రి:**
భారతీయ జనతా పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశం జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిశిధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ పార్టీ మరింత బలపడేలా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నాం. రాష్ట్రంలోని గ్రామాల వారీగా పార్టీని మొదటి స్థానంలో తీసుకెళ్లేలా పోలింగ్ బూత్ స్థాయి నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే సాధనంగా ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతి నాయకుడు భాగస్వామ్యమై, అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా ప్రతి ఒక్కరూ మరో వందమందిని సభ్యుడిగా చేర్పించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సభ్యత్వ జిల్లా ప్రబారి రాజ వర్ధన్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సత్యపాల్ రెడ్డి వెన్నంపల్లి పాపన్న నాగపురి రాజమౌళి గౌడ్ చదువు రామచంద్రారెడ్డి కన్నం యుగేందర్ జిల్లా సభ్యత్ ఇంచార్జ్ జన్న మొగిలి సభ్యత్వ ప్రముఖ్ లు , సహ ప్రముఖ్ లు, వివిధ మండలాధ్యక్షులు వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

# బాలికలు చదువులో రాణించాలని జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య




**భూపాలపల్లి, నేటిధాత్రి:**
బాలికలు చదువులో రాణించాలని జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య అన్నారు అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బేటీ బచావో -భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా సుభాష్ కాలనీ అంగన్వాడి సెంటర్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం డిడబ్ల్యూ మాట్లాడుతూ ఆడపిల్లలపై ఉండే వివక్షత హింస బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలు గురించి వివరించారు సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని, మహిళలు నేడు పురుషులకు సమానంగా రాణిస్తున్నారని, ఆడపిల్లలకు చిన్న వయసులోనే వివాహాలు చేసి ఇబ్బందులకు గురి చేయొద్దని ,ఇద్దరు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన పథకమును ఉపయోగించుకోవాలని 18 సంవత్సరాలలోపు పిల్లలకు ఏమైనా సమస్యలు వస్తే 1098 నెంబర్ ని ఉపయోగించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ అనూష అకౌంటెంట్ సురేష్ సూపర్వైజర్స్ అరుణ, రజిత చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ తిరుపతి కేస్ వర్కర్స్ కళావతి సాయిరాం అంగన్వాడి టీచర్ వసంత మహిళలు తదితరులు పాల్గొన్నారు

# పట్ట పగలే విచ్చలవిడిగా ఆటో ల్లో తరలిస్తున్న మద్యం

- పట్టించుకోని ఎక్సైజ్ అదికారులు
- పెరుకే కిరాణం అమ్మేది మాత్రం మద్యం....
- గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు...
- పల్లెల్లో బార్లను తలపిస్తున్న బెల్ట్ షాపులు...
- నిబంధనలకు విరుద్ధంగా సిండికేట్ అయిన కారేపల్లి బార్ షాప్ ల యాజమాన్యం



**కారేపల్లి, నేటిధాత్రి:**
వైన్స్ షాపుల యాజమాన్యాలు సిండికేట్ గా ఏర్పాటయ్యి విచ్చలవిడిగా బెల్ట్ షాపుల దందా కొనసాగిస్తున్న పరిస్థితి కారేపల్లి మండల కేంద్రంలో నెలకొన్నది.గతంలో ఉన్న వాటి కంటే రెట్టింపు సంఖ్యలో బెల్టుషాపుల ఏర్పాటుతో వైన్స్ షాపుల యజమానులు జేబులు నింపుకుంటున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. కారేపల్లి మండల కేంద్రంలోని వైన్ షాపుల టెండర్ దారులు సిండికేట్ గా ఏర్పాటయ్యి బెల్టుషాపుల దందాను కొనసాగిస్తూ మద్యం ప్రియుల జేబులను గుళ్ళ చేస్తున్నారని వైన్ షాపులు మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి పొందినవి రెండు వైన్సులు ఉండగా కారేపల్లి మండల కేంద్రనికి దూరంగా ఉండే గ్రామాల్లోని మద్యం ప్రియులకు బెల్టుషాపులే గతవుతున్నాయనీ దీనితో వారు బెల్టుషాపులను ఆశ్రయించడం వలన బ్రాండ్ ను బట్టి రూ.20 నుండి రూ.30 ఫుల్ బాటిల్ కు రూ.50 నుండి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.అధిక రేటుపై ప్రశ్నించిన ప్రజలపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఇదిలా ఉండగా బెల్ట్ షాపులవారికి వైన్ షాప్ యాజమానులు క్వార్టర్ కు రూ.10, ఫుల్ బాటిల్ కు రూ.40 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని ధరలను ప్రశ్నించిన మద్యం ప్రియులపై ఆగ్రహం చూపిస్తూ ధరలు అదేవిధంగా అమ్ముతామని అంటున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు.

పెరుకే కిరాణం.అమ్మేది మాత్రం మద్యం.సింగరేణి మండలం లోని పలు గ్రామాలలో ఎక్కువ మంది పేరుకు కిరాణా దుకాణాలుగా నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారనీ సొంత ఇళ్లల్లో పెద్ద పెద్ద ఫ్రిజ్జులు పెట్టుకొని మరీ విక్రయిస్తున్నారని బెల్ట్ షాపులవారికి వైన్ షాపుల యజమానులు ఆటోల ద్వారా మధ్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారని అన్నారు.వైన్ షాపు నిర్వాహకులు బెల్ట్ శాపులవారికీ గ్రామాలకు నిత్యం ఆటోల్లో పంపించి అమ్మిస్తున్నారని అంటున్నారు.మద్యం మత్తులో ఇండ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.పచ్చని సంసారాల్లో మద్యం చిచ్చు విచ్చలవిడిగా గ్రామాల్లో దొరుకుతున్న మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చులు పెడుతున్నాయని మండలంలోనీ ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు పుట్ట గొడుగులవలె వెలుస్తున్నాయనీ దీంతో పొద్దంతా పనిచేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీదిన పడేస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు.గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తుండడంతో యువత పెడదారి పడుతు మద్యం మత్తులో బైక్ యాక్సిడెంట్స్ అయ్యి జీవితాలను మధ్యంతరంగా చాలిస్తున్నారని ఈ విషయాన్ని సంబంధిత ఎక్సైజ్ అధికారులు చూసి చూడనట్టు వదిలేయడంపై ప్రజల్లో అధికారులపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు.ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

**బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ అధికారులు...!**
ఎక్సైజ్ అధికారులు వైన్స్ షాపుల వైపు అసలు కన్నెత్తి చూడడం లేదనీ నెల నెల వారికి మామూళ్లు వైన్స్ షాపుల నుండి అందుతున్నాయని దీనితో వారు ఇటువైపే రావడం లేదని మండల ప్రజలు అంటున్నారు.ఎక్సైజ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకొకపోవడం వలన వైన్స్ షాపు యజమానులు సిండికేట్ అయ్యి ఇష్టారీతిన బెల్టు షాపులకు మద్యాన్ని ఆటోల్లో సరఫరా చేస్తున్నారని స్వయంగా ఎక్సైజ్ అధికారులే ఈ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నారని ప్రజలు అంటున్నారు.

**బెల్టు షాపులతో గ్రామాల్లో నేరాలు..!**
గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణతో 18 సంవత్సరాలు నిండని యువకులు మద్యానికి బానిసై వారి భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు కూలి పనులు చేసుకునే వారు వారికి పనిచేస్తే వచ్చే డబ్బులను బెల్టు షాపుల్లో మద్యానికే వేచ్చించడంతో వారి కుటుంబంలో గొడవలు వస్తున్నాయంటున్నారు. బెల్టుషాపులతో దొంగతనాలు నేరాలు పెరుగిపోతున్నాయంటున్నారు.ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు ఈ సిండికేట్ దందాకు చెక్ పెట్టి వైన్స్ షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఎన్ ఎచ్ -44 నందు ఆక్సిడెంట్స్(బ్లాక్ స్పాట్స్) జరిగే ప్రదేశాలను పరిశీలించిన





**మహబూబ్ నగర్ జిల్లా, నేటిధాత్రి:**
మహబూబ్ నగర్ జిల్లా లోని బాలానగర్ నుండి అడ్డకల్ వరకు వున్న నేషనల్ హైవే -44 పై ఆక్సిడెంట్స్ ఎక్కువగా జరిగే ముఖ్యమైన బ్లాక్ స్పాట్స్ (బ్లాక్ స్పాట్స్ ) ను నెషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ ఎచ్ ఎ ఐ ) అధికారులు మరియు పోలీసు అధికారులతో కలిసి జిల్లా ఎస్పీ శ్రీమతి డి జానకి ఐపీఎస్.సందర్శించరు.. నేషనల్ హైవే-44 పై చాలా ఆక్సిడెంట్స్ జరిగి ప్రాణాలు కొలిపోతున్నారు కావునా ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకి మరియు ఎన్ ఎచ్ ఎ ఐ అధికారులకి ప్రమాద నివారణ సూచనలు జారీ చేశారు.

1. స్పీడ్ కంట్రోల్: గరిష్ట వేగ పరిమితిని అమలు చేయడం. అధిక వేగంతో ప్రయాణించే వాహనాలను సీసీటీవీల ద్వారా గుర్తించి జరిమానాలు విధించడం.
2. సిగ్నల్స్ మరియు హెచ్చరికలు: ప్రమాదకరమైన మలుపులు, అడ్డగూడులు, స్కూల్ జోన్, రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ ఏర్పాటు చేయడం.
3. కన్స్ట్రక్షన్ క్వాలిటీ మెరుగుపరచడం: రోడ్డు క్వాలిటీని మెరుగుపరచడం మరియు గుంతలను సమయానికి సరిచేయడం.
4. సీట్బెల్ట్ మరియు హెల్మెట్ ఉపయోగం: సీట్బెల్ట్ మరియు హెల్మెట్ ధరించడం వంటి భద్రతా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. దీనిని అమలు చేయడానికి సర్విలెన్స్ ఇంకా పోలీసు పర్యవేక్షణ పెంచడం.
5. ప్రమాద నివారణ కార్యక్రమాలు: డ్రైవర్లకు అవగాహన సదస్సులు, ప్రమాదాల నివారణపై శిక్షణ తరగతులు నిర్వహించడం.
6. మెడికల్ ఫెసిలిటీలు: హైవేలపై అత్యవసర మెడికల్ సెంటర్లు ఏర్పాటు చేయడం, ప్రమాదాలు జరిగిన వెంటనే వైద్య సేవలు అందించేందుకు ఎంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచడం.
7. సీసీటీవీ మరియు ట్రాఫిక్ మానిటరింగ్: కీలక ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టడం.
8. మద్యం సేవించి వాహనం నడపడం నివారణ: మద్యం తాగి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం, రోడ్డు పక్కన శిక్షణ పరీక్షలు నిర్వహించడం.

ఈ చర్యలు అమలు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గించి భద్రతను మెరుగుపరచవచ్చు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిఎస్పి వెంకటేశ్వర్లు, డీసీఆర్ బీ డీఎస్పీ రమణారెడ్డి, నేషనల్ హైవే అథారిటీ (ఎన్ ఎచ్ ఎ ఐ ) అధికారులు, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ ఆదిరెడ్డి, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు..

# జమ్మికుంట ట్రాన్స్కో సబ్ డివిజన్ పరిధిలో బదిలీలు

**జమ్మికుంట, బీనేటిధాత్రి:**
జమ్మికుంట మండలం ట్రాన్స్కో డిపార్ట్మెంట్లో బదిలీలలో భాగంగా ఏయ్ తనువుల రవీందర్ ట్రాన్స్ఫర్ టు హెచ్డి మీటర్స్ కరీంనగర్ సాంబయ్య లైన్ ఇన్స్పెక్టర్ తనువుల ట్రాన్స్ఫర్ టు జమ్మికుంట టౌన్ పుల్లూరి సంపత్ కుమార్ బిస్గిరి షరీఫ్ టు ట్రాన్స్ఫర్ తాడికల్ సబ్స్టేషన్ వైద్య శ్రీనివాస్ లైన్మెన్ వావిలాల టు ట్రాన్స్ఫర్ ఎలుబాక సబ్స్టేషన్ కోడెం రాజబాబు అసిస్టెంట్ లైన్మెన్ శాయంపేట టు ట్రాన్స్ఫర్ జమ్మికుంట టౌన్ పెంగిలి రవీందర్ జేఎల్ఎం విలాసాగర్ టు ట్రాన్స్ఫర్ రాసపల్లి ఈ విధంగా ట్రాన్స్ఫర్ అయినట్టు ట్రాన్స్కో శాఖ తెలియపరిచింది



# మద్యంతాగి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులకు జైలుశిక్ష

**నర్సంపేట, నేటిధాత్రి:**
నర్సంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యంతాగి వాహనాలు నడుపుతూ ఇటీవల పోలీసుల వాహన తనిఖీలో పట్టుబడిన నలుగురు వ్యక్తులకు కోర్టు ఐదు రోజుల జైలు శిక్ష,1000 రూపాయలు జరిమాన విధించినట్లు నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నర్సంపేట పరిధిలో వాహనాలు తనకు నిర్వహిస్తుండగా నర్సంపేట పట్టణం వల్లభ్ నగర్ కు చెందిన చింతకింది సురేందర్, ఇందిరానగర్ కు చెందిన మహమ్మద్ అహ్మద్,అలాగే సర్వాపురంకు చెందిన దారా అరుణ్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం ఓటాయి గ్రామానికి చెందిన మాలోత్ సంతోష్ లు మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టు పడ్డారు. వారిని నర్సంపేట కోర్టులో హాజరుపరచగా నర్సంపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కొత్త లక్ష్మీనారాయణ ఈ నలుగురికి ఐదు రోజుల జైలు శిక్ష ఒక్కరికి 1000 రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అలాగే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు కొరకు ఆర్టీవో సిఫారసు చేస్తామని సీఐ హెచ్చరించారు.





# అదృశ్యమైన ఏడేండ్ల బాలిక.. శవమై కనిపించింది

**హైదరాబాద్, నేటిధాత్రి:**
మూడు రోజుల క్రితం అదృశ్యమైన ఏడేండ్ల బాలిక.. శవమై కనిపించింది. బిడ్డ మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ విషాద ఘటన సూరారంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్‌కు చెందిన భార్యాభర్తలిద్దరూ బతుకుదెరువు కోసం తన బిడ్డ(7)తో కలిసి హైదరాబాద్‌లోని సూరారం వచ్చారు. గత ఏడు నెలల నుంచి అక్కడే నివాసం ఉంటున్నారు. అయితే శనివారం(అక్టోబర్ 12) నాడు ఏడేండ్ల బిడ్డ అదృశ్యమైంది. దీంతో ఆందోళనకు గురైన బాలిక తల్లిదండ్రులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే ఇవాళ మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి పరిధిలోని బాసరగడి వద్ద బ్యాగులో మృతదేహం ఉన్న విషయాన్ని స్థానికులు గమనించారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన సూరారం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలికపై అత్యాచారం చేసి హత్య చేశారా..? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా..? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం డెడ్ బాడీని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సూరారం నుంచి గుండ్లపోచంపల్లి దారిలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.



# అమెరికా-భారత్ మధ్య భారీ డిఫెన్స్ డీల్

♦ రూ.31వేలకోట్లతో ప్రిడేటర్ డ్రోన్స్ కొనుగోలుకు ఒప్పందం.

**దేస్క్, నేటిధాత్రి:** అగ్రరాజ్యం అమెరికాతో భారీ డీల్ కుదుర్చుకున్నది. 31 ప్రిడేటర్ డ్రోన్లను కొనుగోలు చేసేందుకు ఇరుదేశాలు ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు ఓ అధికారి వెల్లడించారు. ఈ ఒప్పందం విషయంలో ఇరుదేశాల మధ్య చాలాకాలంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ డీల్ రూ.32వేలకోట్ల విలువ ఉంటుందని ఆ అధికారి పేర్కొన్నారు. ఈ డ్రోన్ల సహాయంతో భారతదేశ నిఘా సామర్థ్యం మరింత పెరగనున్నది. ఈ ఒప్పందానికి రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీ గతవారం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. భారత్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరు దేశాల ఉన్నతాధికారులు, సైనికాధికారుల సమక్షంలో ఒప్పందం కుదిరింది. హిందూ మహాసముద్రంలో భారత్ నిఘా సామర్థ్యం భారీగా పెరగనుంది. గత ఏడాది ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా 31 ప్రిడేటర్ డ్రోన్‌లను కొనుగోలుపై భారత్ రక్షణ ఒప్పందాన్ని ప్రకటించింది. ఒప్పందంపై యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ మాట్లాడుతూ.. రెండుదేశాల మధ్య వ్యూహాత్మక సాంకేతిక సహకారం, సైనిక సహకారాన్ని గణనీయంగా పెంచుతుందని చెప్పారు. ప్రిడేటర్ డ్రోన్స్ ఎంక్యూ-9బీ కొనుగోలుతో హిందుమహాసముద్రంలో భారత నైకాదళం నిఘా సామర్థ్యం భారీగా పెరుగుతుందని రక్షణరంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రిడేటర్ డ్రోన్‌లను అమెరికన్ కంపెనీ జనరల్ అటామిక్స్ నుంచి కొనుగోలు చేయనున్నారు. భారత్, అమెరికా మధ్య విదేశీ సైనిక ఒప్పందం ప్రకారం ఈ డీల్ జరిగింది. డీల్‌లో భాగంగా 31 ప్రిడేటర్ డ్రోన్లను అమెరికా భారత్‌కు అందించనున్నది. డ్రోన్ల నిర్వహణ, మరమ్మతులను దేశంలోనే చేసేందుకు ఫెసిలిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 15 డ్రోన్స్ నేవికి, మరో ఎనిమిది వైమానిక దళం, మరో ఎనిమిది ఆర్మీకి కేటాయించనున్నారు. హిందూ మహాసముద్రంలో చైనా తన ప్రాభవాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే భారత్ సైతం తన నిఘా సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటూ వస్తున్నది. ఈ ప్రిడేటర్ డ్రోన్స్ ప్రత్యేక ఏంటంటే.. దాదాపు 40వేల అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో దాదాపు 40 గంటలు ఎగురుతాయి. రకరకాల వాతావరణ పరిస్థితుల్లోనూ ఎగిరే సత్తా వీటి సొంతం. ప్రిడేటర్ డ్రోన్లను మానవతా సహాయం, విపత్తుల సమయంలో శోధన, రెస్క్యూ ఆపరేషన్, యాంటీ-సర్ఫేస్ వార్‌ఫేర్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్, ఎయిర్‌బోర్న్ మైన్ కౌంటర్‌మెజర్లు ఉపయోగించవచ్చు. దాడులు సైతం చేయొచ్చు. 2022 జూలైలో ఈ డ్రోన్ సహాయంతో యూఎస్ హెల్‌ఫైర్ క్షిపణిని ప్రయోగించి అల్‌ఖైదా ఉగ్రవాది ఐమన్ అల్ జవహరిని హతమార్చింది. ఈ డ్రోన్ హెల్‌ఫైర్ క్షిపణితో పాటు 450 కిలోల పేలుడ్‌తో ఎగురుతుంది. ప్రిడేటర్ డ్రోన్‌లను తయారు చేసే జనరల్ అటామిక్స్, ఈ డ్రోన్ భాగాలను తయారు చేయడానికి భారత కంపెనీ భారత్ ఫోర్జ్‌తో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డ్రోన్‌ల మరమ్మతులు, నిర్వహణ కోసం కంపెనీ భారతదేశంలోనే ఎంఆర్‌వో హబ్‌ను కూడా ఏర్పాటు చేస్తుంది. దాంతో పాటు కంపెనీ తన సొంత స్వదేశీ యుద్ధ డ్రోన్‌లను తయారు చేయడానికి భారత్‌కు సహకారం అందించనున్నది.

# పాఠశాల భవనాన్ని కూల్చిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి

♦ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరన్ డిమాండి



**కాటారం, నేటిదాత్రి:**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం చిదినేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో గల తరగతి గది భవనాలను ఎలాంటి అనుమతులు లేకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా కూల్చివేశారని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరన్ డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న గ్రామస్తులతో వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేశారు. చిదినేవల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంట్రాక్టర్లు కలిసి భవనం కూల్చివేతకు పాల్పడ్డారని, జిల్లా కలెక్టర్ ను, జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి ముందస్తు అనుమతులు లేకుండా భవనాన్ని ఎలా కూల్చివేస్తారని ఆయన ప్రశ్నించారు. శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వ భవనాలను కూల్చాలంటే సంబంధిత శాఖ అధికారుల సమగ్ర సమాచార నివేదిక మేరకు మాత్రమే చర్యలు చేపట్టాల్సి ఉండగా ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా భవనాన్ని కూల్చడం చట్ట విరుద్ధ చర్యగా బొడ్డు స్మరన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కూల్చివేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సదరు కాంట్రాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరన్ డిమాండ్ చేశారు.

# మండల ప్రజలకు అండగా నిలిచిన ప్రభుత్వ వీఫ్



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:**
తంగళ్ళపల్లి మండలం ఇంద్రమ్మ టెక్స్టైల్.పార్కులో మహిళ గ్రూపులకు సంబంధించి 22 మందిమహిళలకు 15 లక్షల 77 వేల ఐదు వందల రూపాయలుతో పరాయించిన వారు వారికి సంబంధించి కలెక్టర్ కు ప్రభుత్వ వి ఆది శ్రీనివాస్ కి మహిళలందరూ కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. ఇట్టి విషయమై బ్యాంక్ అధికారులు లోను ఎలాగైనా మీరే కట్టాలని వారిని ఇబ్బందికి గురి చేస్తున్నారని స్థానిక మహిళలు ఆది శ్రీనివాస్ కి మొరపెట్టుకున్నారు దీనిపై స్పందించిన ఆది శ్రీనివాస్ మహిళా బాధలను చూసి వారికి జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారికి తగిన న్యాయం చేస్తామని అలాగే బ్యాంకు అధికారులు వారిని ఇబ్బంది పెట్టకూడదని ఎలాగైనా వారిని పట్టించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు బ్యాంకు అధికారులు వారిని ఇబ్బంది పెట్టకూడదని త్వరలోనే సమస్య పరిష్కారమే దిశగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు పరారీలో ఉన్న మహిళ దొరికేవరకు ఎటువంటి ఇబ్బంది పెట్టకూడదని బ్యాంకు అధికారులకు చెప్తానని తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ బాధిత మహిళలు తదితరులు ఉన్నారు

# ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు




**మహబూబ్ నగర్ జిల్లా, నేటిధాత్రి:**
స్థానిక డాక్టర్ బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న, డా. ఏ. పి.జె. అబ్దుల్ కలాం జయంతిని కళాశాల ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్. డా. సుకన్య మాట్లాడుతూ భారతదేశ రక్షణ వ్యవస్థను బలపరచడం కోసం ఎంతో కృషిచేసి మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా పేరుగాంచారని, రాష్ట్రపతిగా ఉంటూ అతి సాధారణ జీవితాన్ని గడిపి ప్రజారాష్ట్రపతిగా ఖ్యాతిగడించారని, అబ్దుల్ కలాం జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సదాశివయ్య, నందకోషోర్, మాధురి, ప్రవీణ్ మరియు కళాశాల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మందు బాబులకు అడ్డాగా.. ప్రభుత్వ కళాశాల

**మహబూబ్ నగర్ జిల్లా, నేటిధాత్రి:**
జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండల కేంద్రంలో మందు బాబులకు ప్రభుత్వ కళాశాల అడ్డగా మారింది. వారం రోజులపాటు దసరా సెలవులు ఉండడం.. సెక్యూరిటీ లేకపోవడంతో మందుబాబులు కళాశాలకు వచ్చి మద్యం సేవించి ఖాళీ సీసాలను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో పాఠశాల విద్యార్థులు వాటిని చూసి అవాక్కయ్యారు. కళాశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో మందుబాబులు అడ్డాగా మారిందన్నారు. మందుబాబుల ఆగడాలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కళాశాలకు ప్రహరీ గోడను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.



# తొర్రూరు పట్టణంలో పిచ్చి కుక్కల స్వైరా విహారం

- తొర్రూరు పట్టణంలో పిచ్చి కుక్కల స్వైరా విహారం
- ఒకేరోజు అంబేద్కర్ నగర్ లో అయిదుగురిని కరిచిన వైనం
- ఉపయోగంలో లేని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- భయబ్రాంతులకు గురవుతున్న పట్టణ ప్రజలు
- సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న సామజిక కార్యకర్త మంగళపల్లి నాగరాజు





**తొర్రూర్ (డివిజన్), నేటిధాత్రి:**
తొర్రూర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్ లో పిచ్చికుక్కలు ఒకేరోజు అయిదుగురిని కరిచిన సంఘటన ఈరోజు చోటుచేసుకుంది. అందులో చిన్నపిల్లలు నలుగురు, పెద్దలు ఒకరు, రెండు మేకలను మూరగుండ్ల రుద్రదీప్(4),మంగళపల్లి చరిష్మా (2),హర్షిత్(2),ఫాయిదా (3),మంగళపల్లి అనిల్ (30) అత్యంత దారుణంగా కరిచాయి. చిన్న పిల్లాడిని జుట్టు పట్టుకొని కరుస్తున్నాయని అడ్డుకోబోయిన అనిల్ కూడా కరిచాయ్. పట్టణ కేంద్రంలో పిచ్చికుక్కలు రోజురోజుకి పెరుగుతున్న మున్సిపాలిటీ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈలాంటి దారుణమైన ఘటనకు కారకులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్న మున్సిపల్ అధికారులు, పాలకులు పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేసారు.
కుక్కల పెరుగుదలను నివారించడం కోసం గతంలో ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ %శ్రీశీ% తూ తూ మంత్రాంగా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం దానిని ఉపయోగించకుండా చోద్యం చేస్తున్న మున్సిపాలిటీ అధికారులు, పాలకులు.ఇప్పటికైనా పట్టణ ప్రజల కోసం సరైన చర్యలు తీసుకోవాలని సామజిక కార్యకర్త మంగళపల్లి నాగరాజు డిమాండ్ చేశారు.








## రాంచరణ్ వర్సెస్ నాగచైతన్య

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య నటిస్తోన్న ప్రాజెక్ట్ తండేల్ రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో 23 ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని చందూ మొండేటి డైరెక్ట్ చేస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ుదల చేస్తున్నట్టు చాలా రోజుల క్రితమే ప్రకటించగా.. తండేల్ విడుదల వాయిదా పడే అవకాశాలున్నాయంటూ మరో వార్త తెరపైకి వచ్చింది. తాజాగా తండేల్ సంక్రాంతి బరిలో నిలువబోతుందన్న అప్‌డేట్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. మరోవైపు రాంచరణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న గేమ్ ఛేంజర్ 2025 జనవరి 10న విడుదల కానుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారని తెలిసిందే. ఇదే నిజమైతే బాక్సాఫీస్ వద్ద గేమ్ ఛేంజర్‌తో పోటీ పడటం ఖాయమైపోయినట్టే. మరి తండేల్ రిలీజ్‌పై మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. తండేల్‌లో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయి సత్య పాత్రలో నటిస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడం విశేషం. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్‌లో చైతూ మత్స్యకారుడిగా మాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు.



## ఆర్జీవీ డెన్‌లో ఓ యానిమల్‌తో మరో యానిమల్

సోషల్ మీడియాలో ఎప్పుడూ ఏదో ఒక ట్వీట్‌తో వార్తల్లో నిలిచే డైరెక్టర్ల జాబితాలో రాంగోపాల్ వర్మ మొదటి స్థానంలో ఉంటాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఆర్జీవీ ఏ కామెంట్ పెట్టినా.. ఫొటో పెట్టినా నెట్టింట తెగ చర్చ జరగడమే కాదు.. అది టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా కూడా నిలుస్తుంటుంది. తాజాగా యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తో ఉన్న ఫొటోను ఎక్స్‌లో షేర్ చేశాడు వర్మ. ఆర్జీవీ డెన్ యానిమల్ పార్క్‌లో ఓ యానిమల్ మరో యానిమల్‌ను ఇంకొక యానిమల్‌కు చూపిస్తుందంటూ తనదైన శైలిలో ట్వీట్ చేశాడు వర్మ. స్క్రీన్‌పై వర్మ చూపిస్తున్న విజువల్‌ను ఆసక్తిగా చూస్తున్నాడు సందీప్ రెడ్డి వంగా. ఇంతకీ వర్మ యానిమల్ డైరెక్టర్‌కు ఏం చూపిస్తున్నాడన్నది మాత్రం మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. మరి దీనిపై ఈ ఇద్దరు క్రేజీ దర్శకులు ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలంటున్నారు సినీ జనాలు. హైదరాబాద్‌లో వర్మ ప్రత్యేకంగా నిర్మించుకున్న ఆర్జీవీ డెన్ ఎంత పాపులర్ అయ్యిందో తెలిసిందే. ఆర్జీవీ డెన్‌కు ఆసక్తిగల దర్శకులు, రైటర్స్, మ్యూజిక్ కంపోజర్స్ కావాలంటూ ఓ ప్రకటన కూడా చేశాడు వర్మ. ఈ ఏడాది వర్మ ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీలో కామియో రోల్‌లో మెరిసి అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చాడని తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా ఖాతాలో యానిమల్ పార్క్, స్పిరిట్ సినిమాలున్నాయి.






## 'దేవర' సక్సెస్‌పై 'ఎన్టీఆర్' ఎమోషన్

తన కొత్త సినిమా 'దేవర' పార్ట్-1కు దక్కిన ఆదరణపై జూనియర్ ఎన్టీఆర్ ఆనందం వ్యక్తం చేశారు. చిత్ర బృందం, ప్రేక్షకులు, అభిమానులకు సోషల్ మీడియా వేదికగా ఎన్టీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ సందేశం ఇచ్చారు జూనియర్ ఎన్టీఆర్. దేవర్ పార్ట్-1కి అందుతున్న అద్భుతమైన స్పందనకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సినిమా ఎప్పిటకీ నా హృదయంలో ప్రత్యేక స్థానం కలిగి ఉంటుంది. నా సహ నటులైనా సైఫ్ అలీఖాన్, జాన్వీ కపూర్, ప్రకాశ్ రాజ్, శ్రీకాంత్.. వారి పాత్రలకు ప్రాణం పోసి, మా కథకు జీవం ఇచ్చారని జూనియర్ ఎన్టీఆర్ ప్రశంసలతో ముంచెత్తారు. ఈ సినిమాను తెరకెక్కించిన దర్శకుడు కొరటాల శివకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనిరుధ్ అద్భుతమైన సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫి, సాబు ప్రొడక్షన్ డిజైన్, యుగంధర్ వీఎఫ్ఎక్స్, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్‌తో ఈ చిత్రాన్ని అద్భుతంగా మలిచినందుకు ధన్యవాదాలు. నిర్మాతలు సుధాకర్ మిక్కిలినేని, హరికృష్ణ కొసరాజుకు ధన్యవాదాలు. ప్రపంచం నలుమూలల ఇంతటి ఆదరణ చూపిస్తున్న ప్రేక్షక దేవుళ్లకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు. నా కుటుంబ సభ్యులైన నా అభిమానులకు, గత నెల రోజులుగా దేవర చిత్రాన్ని ఒక పండుగలా జరుపుకుంటున్నందుకు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. మీరు చూపించే ప్రేమ అభిమానమే నన్ను ఈ స్థాయికి చేర్చింది. మీరు ఎల్లప్పుడూ గర్వపడే చిత్రాలు చేస్తూనే ఉండడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. దేవర్ పార్ట్ 1 చిత్రాన్ని మీ భుజాలపై మోసి, ఇంతటి ఘన విజయాన్ని అందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జూనియర్ ఎన్టీఆర్ పేర్కొన్నారు.

## యోధుడిగా సాయి దుర్గ తేజ్.. 18 గ్లింప్స్ అదిరిందంతే

సాయి దుర్గ తేజ్ కాంపౌండ్ నుంచి వస్తున్న తాజా చిత్రం %ాణు%18. రోహిత్ కేపీ దర్శకత్వం (డెబ్యూ) వహిస్తున్న ఈ మూవీలో ఐశ్వర్య లక్ష్మి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మేకర్స్ ముందుగా ప్రకటించిన ప్రకారం %ాణు%18 గ్లింప్స్ షేర్ చేశారు. ధైర్యాన్ని తన కవచంగా, ఆశయే ఆయుధంగా.. అతడు చివరిగా నిలబడి ఉన్నాడు.. అంటూ తిరుగులేని మెగా సుప్రీమ్ హీరోకి మూవీ టీం శుభాకాంక్షలు తెలియజేసింది. సాయి ధరమ్ తేజ్ పవర్‌ఫుల్ పుట్టినరోజు సందర్భంగా ఆర్కాడీ ప్రపంచంలోకి ప్రత్యేక ప్రవేశం.. అంటూ విడుదల చేసిన గ్లింప్స్‌లో సాయి దుర్గ తేజ్ కండలు తిరిగిన దేహంతో శక్తివంతమైన శూలాన్ని పట్టుకొని స్టన్నింగ్ విజువల్స్‌తో పీరియాడిక్ ప్రపంచంలోకి తీసుకెళ్లనున్నట్టు గ్లింప్స్ చెబుతోంది. ఈ చిత్రాన్ని హనుమాన్ మేకర్స్ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో తెరకెక్కిస్తున్నారు. కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా వస్తోంది. ఈ మూవీలో ఐశ్వర్యలక్ష్మి వసంత పాత్రలో కనిపించనుండగా.. దీనికి సంబంధించిన లుక్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం 1947 హిస్టరీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్నట్టు తెలుస్తుండగా.. సాయి దుర్గ తేజ్ ఒక యోధుడి పాత్రలో నటిస్తున్నట్టు గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది.




## రెట్రో అనుభూతిని కలిగించేలా.. లే రాజా.. లే లే రాజా

మెగా హీరో వరుణ్‌తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మట్కా' పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కరుణకుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు జోరందుకున్నాయి. అందులో భాగంగా 'లే లే రాజా..' అంటూ సాగే ఈ సినిమాలోని తొలి పాటను మేకర్స్ విడుదల చేశారు. రెట్రో అనుభూతిని కలిగించేలా భాస్కరభట్ల రాసిన ఈ పాటను 70, 80ల కాలం నాటి తీరులో జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరిచారు. నీతి మోహన్ ఆలపించారు. ఈ పాటలో వరుణ్‌తేజ్ భిన్నమైన గెటప్పులతో ఆకట్టుకోగా, కలర్‌ఫుల్ పబ్ నేపథ్యంలో సాగిన ఈ పాటలో నోరా ఫతేహి రెట్రో లుక్‌లో అలరించారు. జానీ మాస్టర్ నృత్య రీతులు ఈ పాటకు హైలైట్‌గా నిలిచాయి. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈచిత్రం నవంబర్ 14న గ్రాండ్‌గా విడుదల కానుంది. నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిశోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎ.కిశోర్‌కుమార్.



## సూర్య కంగువ టార్గెట్ రూ.2 వేల కోట్లు

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ . సూర్య 42వ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ మూవీకి శివ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ భామ దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. బాబీ డియోల్ విలన్ రోల్ పోషిస్తున్నాడు. కంగువ నవంబర్ 14న తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడులవుతుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు. పమోషన్స్‌లో డైరెక్టర్ శివ ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు. కంగువ రన్‌టైం 2 గంటల 26 నిమిషాలు. చారిత్రక నేపథ్యం ఉన్న పోర్షన్లలో కంగువగా కనిపిస్తాడు సూర్య. సుమారు 2 గంటలపాటు కంగువ మేనియా ఉంటుంది. ప్రస్తుత కథ కేవలం 25 నిమిషాలు మాత్రమే ఉంటుందని చెప్పాడు. సూర్య కంగువగా ఇదివరకెన్నడూ కనిపించని నయా అవతార్‌లో కనిపిస్తాడు. హిస్టారికల్ పోర్షన్లలో సూర్య రౌద్రరూపంలో కనిపించనుండగా.. వర్తమానానికి సంబంధించిన సన్నివేశాలు ఫన్‌గా సాగుతాయని కూడా చెప్పాడు. మరోవైపు సినిమా అవుట్ పుట్ పట్ల చాలా నమ్మకంతో ఉన్నామని.. కంగువ రూ.2000 కోట్లు వసూళ్లు చేయడం పక్కా అని ధీమా వ్యక్తం చేశాడు నిర్మాత కేఈ జ్ఞానవేళ్ రాజా. కంగువ వసూళ్ల విషయంలో జ్ఞానవేళ్ రాజా కాన్ఫిడెన్స్‌ను చూసి ఆశ్చర్యపోతున్నారు సినీ జనాలు. ఈ మూవీని స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.














# ఆ ఇద్దరు ఎంత "సంతోష" పెట్టారు?

టీపీవో సంతోష్



చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేంద్రరావు
9063524196, 9908658888









# ఈ నలుగురు ఏం పాపం చేశారు!?

ఎక్స్‌క్లూసివ్ నేటిధాత్రి exclusive

- ఈ రెండింటినీ కూల్చకుండ ఎందుకు ఆపారు?
- ఆ రెండింటికి సమయమెందుకిచ్చారు!
- ఉన్నఫలంగా ఈ నలుగురిని ఎందుకు రోడ్డు మీద పడేశారు?
- ఆ ఇద్దరికెందుకు ఇంకా సమయమిస్తున్నారు.
- చిత్రపురి కూల్చి వేతల్లో కిరికిరిలెందుకు పెట్టారు.
- కూల్చివేతల్లో వ్యత్యాసం ఎందుకు చూపించారు.
- ఆ ఇద్దరి మీద వున్న మమకారం ఏమిటి?
- ఈ నలుగురి మీద లేని కనికరానికి కారణమేమిటి?
- ఆ మాజీ ఎమ్మెల్సీకి రో హౌజ్ ఎలా వచ్చింది.
- చిత్రపురిలో ఈ మతలబు ఏమిటి?
- చిత్రపురి సొసైటీలో బంధువుకు రోహౌజ్ కేటాయింపేమిటి?
- కూల్చివేతలో అ ఇద్దరికి మినహాయింపేమిటి?
- పదిహేను రోజుల గడువు దాటి పాతిక రోజులౌతోంది.
- ఆ రెండు కూల్చివేతలలో ఇంత కాలం జాప్యమేమిటి?
- సొసైటీ సెక్రటరీకి ఒక రూలు...ఆ నలుగురికి మరో రూలా?
- చిత్రపురిలో రాజకీయ నాయకుడికి రో హౌజ్ కేటాయింపేమిటి?
- బినామీ ఆస్తులు ఎంత కాలం దాస్తారు?
- నిబంధనలకు తూట్లెందుకు పొడుస్తున్నారు!
- ఆ రెండు కూల్చివేతలు ఆగడంలో అదృశ్య శక్తులెవరు?
- మణికొండ మున్సిపాలిటీని శాసిస్తున్నదెవరు?
- హైడ్రా తరహా కూల్చివేతలు జిల్లాల్లోనూ సాగుతున్నాయి!
- మణికొండ బుల్డోజర్లు ఆ రెండు రోహౌజ్‌ల వైపు ఎందుకు వెళ్లనంటున్నాయి?

హైదరాబాద్,నేటిధాత్రి:

తవ్వినా కొద్ది చిత్రపురి హౌజింగ్ సొసైటీలో చిత్ర విచిత్ర దోపిడీ విన్యాసాలు బైటపడుతూనే వున్నాయి. కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగు చూస్తూనేవున్నాయి. చిత్ర పురి అంశం కొత్తదికాదు. దానిలో వున్న అగాదాలకు అంతం లేదు. అంతు లేదు. ఇంతకాలం వెలుగులోకి రాని అనేక అంశాలు నేటిధాత్రి వెలుగులోకి తెస్తూనే వుంది. నేటిధాత్రి రాసిన వరుస కథనాలతో చిత్రపురిలో జరిగిన అనేక అవకతవకలు బైటపడుతూనే వున్నాయి. తాజాగా రోహౌజ్‌ల విషయంలో కూడా సరికొత్త అంశాలు కనిపిస్తున్నాయి. చిత్రపురిలో 225 రోహౌజ్‌లకు అనుమతులున్నాయి. కాని అవి కార్మికుల కన్నీటి మీద నిర్మాణం చేసుకున్నవి. చట్టపరమైన అనుమతులున్నాయని చెప్పుకున్నా, కార్మికుల కష్టం దోచుకున్న పాపుల పాపాలకు సాక్ష్యాలు. అయితే 225 రోహౌజ్‌లతోపాటు ఓ ఆరు రోహౌజ్‌లు అదనంగా నిర్మాణం చేశారు. 225 రో హౌజ్‌లకు పర్మిషన్లు వున్నాయంటున్నారు. కాని మరో ఆరు రో హౌజ్‌లకు ఎలాంటి అనుమతులు అసలే లేవు. అక్కడ ఆ కట్టడాలకు ఎలాంటి అవకాశం లేదు. కాని నిర్మాణాలు చేశారు. రోహౌజ్‌లను నిర్మాణం చేసుకున్నారు. ఈ విషయాన్ని నేటిదాత్రి వెలుగులోకి ఎప్పుడో తెచ్చింది. దాంతో మణికొండ మున్సిపాలిటీ రంగంలోకి దిగింది. ఆరు రోహౌజ్‌ల కూల్చివేతకు రంగం సిద్ధం చేసింది. కాని నాలుగు రో హౌస్‌లు మాత్రమే కూల్చి వేసింది. మరో రెండు రో హౌస్‌లను కూల్చివేయలేదు. ఆ రెండు ఎవరివని నేటిధాత్రి ఆరా తీస్తే అసలు విషయాలు వెలుగు చూశాయి. ఈ విషయాన్ని గతంలోనే మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అదికారిని నేటిదాత్రి ప్రశ్నించడం జరిగింది. ఆ నలుగురు చేసిన పాపం ఏమిటి? కూల్చని ఇద్దరు చేసిన పుణ్యం ఏమిటని నిలదీయడం జరిగింది. కొంత సమయం కావాలని ఆ రెండు రో హౌజ్‌లకు చెందిన యజమానులు కోరడంతో కనికరించామని చెప్పారు. అయితే ఎంతకాలం తర్వాత కూల్చివేతలు జరగొచ్చన్నదానిపై కూడా స్పష్టత కోరడం జరిగింది. ఓ పది హేను రోజుల సమయం ఇచ్చేందుకు అంగీకరించినట్లు అదికారులు చెప్పారు. కాని ఆ పదిహేను రోజుల సమయం ఎప్పుడో పూర్తయింది. అదనంగా మరో పాతిక రోజులు కూడా పూర్తవుతోంది. కాని రెండు రోహౌజ్‌ల జోలికి ఇంకా వెళ్లడంలేదు. కారణమేమిటని ఆరాతీస్తే ఒక రోహౌజ్ గత ప్రభుత్వంలో కీలకమైన నాయకుడుగా తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమం పేరుతో నాయకుడైన ఆ నాయకుడు బిఆర్ఎస్ పార్టీకి అధికార ప్రతినిధిగా కొనసాగుతూ వుండేవారు. ఉద్యమ సమయంలో ఒంటికాలిపై లేస్తూ కాంగ్రెస్, బిజేపి, తెలుగుదేశం పార్టీలను ఉతికి ఆరేస్తుండేవారు. ఎప్పుడూ టివి చర్చల్లో ఎక్కువగా కనిపిస్తూ వుండేవారు. తెలంగాణపై కార్యాచరణలో కొంత దూకుడుగా కనిపించేవారు. అలా టివిలలో కనిపించిన నాయకుడు వక్త మాత్రమే. ఆయనకు సినీ రంగంలో ఎలాంటి సంబంధం లేదు. కనీసం టెలివిజన్ రంగంతో కూడా అనుబంధం లేదు. నటుడు అసలే కాదు. కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే. తెలంగాణ వచ్చిన తర్వాత ఆయన నోరేసుకొని సినిమా వాళ్లను బెదిరించిన సందర్భాలు అనేకం వున్నాయి. తర్వాత కాలంలో ఆయన ఎమ్మెల్సీ కూడా అయ్యారు. ఐదేళ్లలో సంపన్నుడయ్యారు. అలాగే చిత్రపురిలో కూడా వేలు పెట్టాడు. ఏం చేస్తారో నాకు తెలియదు..నాకు ఒక రోహౌజ్ కావాలన్నాడు. అంతే చిత్ర పురి హౌజింగ్ సొసైటీలో అనధికారికంగా రోహౌజ్ నిర్మాణం చేసి ఆ నాయకుడికి ఇచ్చేశారు. కాని ఇంత కాలం వరకు ఆ రోహౌజ్ ఆ నాయకుడికి అన్న సంగతి లోకానికి తెలియకుండా మేనేజ్ చేశాడు. బినామీ పేరు మీద ఇల్లు రాయించుకున్నాడు. ఆ బినామీ కూడా ఎవరని నేటిదాత్రి ఆరా తీసింది. బిఆర్ఎస్ నాయకుడికి బావమర్ధిపేరు మీద వుందన్న సంగతి తెలిసింది. తన పేరు బైటకు రాకుండా రోహౌజ్‌ను తన బావమర్ధి పేరన లాభం పొందారు. అక్రమంగా నిర్మాణం చేసిన రోహౌజ్‌లను మున్సిపాలిటీ కూల్చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆరు రోహౌజ్‌లలో నాలుగు కూల్చేశారు. కాని మిగిలిన రెండు రోహౌజ్‌లను ముట్టుకోవడానికి అదికారులు వెనకుడుగు వేస్తున్నారా? లేక భయపడుతున్నారా? అదీ కాకుండా ఆ రెండు రోహౌజ్‌ల పెద్దలు టైన్ ప్లానింగ్‌ను సంతోషపెట్టారా? అన్న చర్చ మొదలైంది. ఒక రో హౌజ్ బిఆర్ఎస్ నాయకుడి కాగా మరో కూల్చని రోహౌజ్ ఒక దొరదంటున్నారు. ఆయన చిత్రపురి సొసైటీకి సెక్రెటరీగా కొనసాగుతున్నారని తెలుస్తోంది. సెక్రెటరీ కావడంతోనే దొర రోహౌజ్ కూల్చివేత ఆగింది. ఇక్కడ కూడా రోహౌజ్ నిర్మాణంలో బంధుత్వమే కీలక భూమిక పోషించిందని తెలుస్తోంది. చిత్రపురి సొసైటీకి చెందని అతి కీలకమైన వ్యక్తికి దొర సమీప బంధువే కావడం గమనార్హం. అంటే సినీపెద్దల బంధుగణమే కాదు, సొసైటీ పెద్దల బంధువులు కూడా ఆవాసాలు అక్రమంగా నిర్మాణాలు సాగించుకున్నారు. దొంగలు దొంగలు కలిసి ఊర్లు దోచుకున్నట్లు చిత్రపురి భూమిని బకాసులై పంచుకున్నారు. ఈ రెండు రోహౌజ్‌ల కూల్చివేత ఆగిపోవడానికి ఎంతకు మేనేజ్ చేసుకున్నాడన్నదే తెలియాల్సివుంది. కూల్చివేతల్లో ఎక్కడైన అదికారులు లాలూచీ పడితే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక కూడా చేశారు. అది ఆ హెచ్చరిక కేవలం హైడ్రాకే వర్తిస్తుందని అదికారులు అనుకున్నారో ఏమో కాని ఆ రెండు రో హౌజ్‌లను కూల్చివేయకుండా ఆపేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలు హైడ్రా పరిధి కట్టడాలకు మాత్రమే అని నిర్ధారించుకున్నారో ఏమోగాని మణికొండ మున్సిపల్ అదికారులు ఆ రెండు రో హౌజ్‌ల మీదకు బుల్లోజర్లు తీసుకెళ్లడానికి ముందూ వెనకు ఆలోచిస్తున్నారు. ఒక వేళ ఆ రెంటిపైకి వెళ్తే తమ బండారం ఎక్కడ బైట పడుతుందో అని టౌన్ ప్లానింగ్ అదికారి వెనుకడుగు వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు రోహౌజ్‌లను కూల్చివేసినా వాటి యజమానులు బైటకు రాలేదు. తమకు అన్యాయం జరిగిందని చెప్పుకోలేకపోయారు. కాని ఈ రెండు రోహౌజ్‌లు కూల్చే శక్తి సంబంధిత అదికారికి లేకుండా పోవడానికి కారణం ఆ ఇద్దరూ పవర్ ఫుల్ కావడంతో ఆగిపోయిందన్న మాటలు వినిపిస్తున్నాయి. ఈ విమర్శలపై టౌన్ ప్లానింగ్ అదికారి సమాదానం చెబుతారా? లేక మౌనం వహిస్తారా? కూల్చివేతలకు సిద్ధమౌతారా? అన్నది తేలాల్సివుంది. కారణం ఏదైనా ఆ రెండు రోహౌజ్‌లు అక్రమమే. వాటి కూల్చివేత సక్రమమే. అయినా వెనుకుడుగు అన్నది ఎందుకు పడుతుందన్నదానిపై స్పష్టత రావాల్సివుంది. వాటిని కూల్చివేయాల్సిన అవసరం వుంది. చిత్రపురిలో అసలు రోహౌజ్‌ల నిర్మాణమే ఒక అన్యాయం. అక్రమం. ఒక రకంగాచెప్పాలంటే దుర్మార్గం. కార్మికుల కోసం ప్రభుత్వం ఎంతో ఉదారంగా భూమిని కేటాయిస్తే అందులో రాబందులు దూరిపోయాయి. కనీసం కార్మికుల కోసం నిర్మాణం జరిగిన అప్పార్టుమెంట్లలో న్యాయం జరగలేదు. అనుయాకులు, అనుచరల పేరు మీద ప్లాట్లు దక్కించుకున్నవారు దక్కించుకున్నారు. పదిహేనేళ్ల క్రితం వున్న సభ్యులకే సరిగ్గా అక్కడ దిక్కులేదు. ఇంకా రెండు ట్విన్ టవర్స్ నిర్మాణం చేస్తామంటున్నారు. అవి మొదలయ్యేదో...ఎప్పుడు పూర్తయ్యేదో...కార్మికులకు న్యాయం జరిగేదెంతో తెలియని అయోమయ పరిస్థితి. అదలా వుంటే సినీ పెద్దలు గద్దలై వాలి ఓ పద్నాలుగు ఎకరాలు ఆక్రమించుకున్నారు. వాటిలో అక్రమంగానే ఇల్లు నిర్మాణం చేసుకున్నారు. ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్న కారణంతో నిర్మాణాలు జరిగినా అవి సక్రమమేం కాదు. కార్మికులు భూమిని లాక్కొని రోహౌజ్‌లు నిర్మాణం చేసుకోవడం ఎవరికీ సమ్మతం కాదు. కాని నోరులేని కార్మికులు అన్యాయాన్ని భరించారు. అక్రమాలను చూస్తూ ఊరుకున్నారు. ఇక్కడ గోల చేస్తే సినిమాల్లో అవకాశాలు రావని భయపడ్డారు. కూలీ దొరక్కపోతే కడుపు మాడుతుదంని నోరు మూసుకున్నారు. కార్మికుల బలహీనత సినీ పెద్దలకు వరమైపోయింది. కార్మికులకు శాపంగా పరిణమించింది. ఓ వైపు కార్మికుల ఉసురు పోసుకుంటూనే మరో వైపు చిత్రపురిని రాబంధుల రాజ్యం చేసుకొని దోచుకున్నారు. రోహౌజ్‌ల పేరుతో కోట్ల స్థిరాస్థులను ఆక్రమించుకున్నారు. రాబంధులకన్నా మేమేం తక్కువ అని నిరూపించుకున్నారు.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి,చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H.No. 7-1-133/3, Opp.New Bus Stand, Laxmipuram,Hanamkonda, Warangal Urban-506001. Telangana State. & Published from, H.No 7-1-133/3. Opp New Bus Stand, Laxmipuram, Hanamkonda, Warangal Urban-506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. AP TEL 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999